21-04-2024
ఆదివారం
హైదరాబాద్
సంపుటి 26, సంచిక: 301
పేజీలు: 12 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్: 12
వెల రూ. 5.00
Published from:
Hyderabad, Khammam,
Karimnagar, Mahabubnagar

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

నేతాజీ సుభాష్ చంద్రబోస్
రూ॥ 70/-
పేజీలు: 68

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.




# బిజెపిని రానివ్వొద్దు

### సిపిఐ, కాంగ్రెస్ నిటారుగా నిలబడి కలిసికట్టుగా పనిచేద్దాం
### లోక్‌సభ ఎన్నికల్లో మద్దతివ్వండి
### సిపిఐ నాయకులకు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుని వ్వాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిపిఐ నాయకులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో సిపిఐ మద్దుతు నిమిత్తం ఆయన శనివారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటర్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటర్‌రెడ్డితో పాటు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులతో భట్టి విక్రమార్క సమావేశమయ్యారు. సిపిఐ మద్దతు కోసం సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సహచరులు తనను ప్రత్యేకంగా మగ్దూంభవన్‌కు పంపించారని భట్టి తెలిపారు. ఈ సమావేశంలో తాజా రాజకీయాలు, లోక్‌సభ ఎన్నికల అంశంపై చర్చించగా, సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, టి శ్రీనివాసరావు, ఎన్.బాలమల్లేష్, కలవేణ శంకర్, బాలనరసింహ, వి.ఎస్.బోస్, ఇటి నరసింహ తదితరులు ఉన్నారు. సమావేశనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో మతోన్మాద బిజెపిని రానివ్వకుండా సిపిఐ, కాంగ్రెస్ నిటారుగా నిలబడి అందరూ కలిసి కట్టుగా పనిచేద్దామని విజ్ఞప్తి చేశారు. లౌకికవాదాన్ని, రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని, పేదల అభివృద్ధిని కాంక్షిస్తూ భవిష్యత్‌లో కూడా కలిసి పని చేయాలని తాము నిర్ణయించుకున్నామన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సిపిఐ సహాయ, సహకారాలను అందించేందుకు అంగీకరించిందన్నారు. దేశ భవిష్యత్తును, ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను, భారత రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఇండియా కూటమి ఒక్కవైపు, మతోన్మాదంతో, నియంతృత్వ పోకడలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, భారత రాజ్యాంగానికి ప్రతిసవాల్ విసురుతున్న బిజెపి మరోవైపు నిలబడిందని తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వ పరంగా సహాయ, సహకారాలను అందిస్తామని సిపిఐ నేతలకు భట్టి హామీనిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సిపిఐకి రెండు ఎంఎల్‌సి స్థానాలు, కార్పొరేషన్ అంశంపై జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు భట్టి స్పందిస్తూ సిపిఐ, కాంగ్రెస్ పరస్పరం గౌరవించుకుంటామన్నారు.

**నిలువరించడమే లక్ష్యం: కూనంనేని**

కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపిని నిలువరించే ఏకైక లక్ష్యంతోనే కాంగ్రెస్‌కు

తరువాయి 2లో

# అకాల వర్షం...
# రైతుకు నష్టం





### కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యం
### పలుచోట్ల దెబ్బతిన్న పంటలు
### నేలరాలిన మామిడి

ప్రజాపక్షం/హన్మకొండ/ జనగామ

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా శనివారం తెల్లవారుజామున ఉరుములు.. మెరుపులతో కూడిన అకాల వర్షాలు కురువడంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హన్మకొండ, జనగామ, వరంగల్, ములుగు, మహబూబాబాద్ జిల్లాలో అకాల వర్షం కురిసింది. దీంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం తడిసిపోవడంతో పాటు వందలాది ఎకరాల పంటలు నీట మునిగాయి. కొన్ని చోట్ల టార్పాలిన్లు లేక పోవడంతో వరదలో వడ్లు కొట్టుకుపోయాయి. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం ఉప్పుగల్లు, తిమ్మంపేటతో పాటు పలు గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే తడిచి ముద్దయింది. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని తరిగొప్పులలో భారీ వర్షం కురవడంతో వందలాది ఎకరాలు నీట మునిగాయి.హన్మకొండ జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలతో పంట నష్టపోయి రైతులు అల్లాడుతున్నారు. వరి, మొక్కజొన్న, రైతులు అకాల వర్షానికి నష్టపోయారు. వర్షానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జిల్లాలోని కాజీపేటతో పాటు హసన్ పర్తి, ఎల్కతుర్తి, ధర్మసాగర్, వేలేరు మండలాలలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మరోవైపు అకాల వర్షాల వల్ల చేతికొచ్చిన పంట పొలాల్లోనే నీళ్ల పాలవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు పంట కోసం కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే వర్షానికి ధాన్యమంతా తడిసి ముద్దయిందని రైతులు వాపోతున్నారు. వారం రోజులు అయినా కాంటా వేయకపోవడం వల్లనే ధాన్యం తడిసిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ జిల్లాలో గ్రామాల్లో ఏర్పాటుచేసి వరి ధాన్యం కొనుగోలు

తరువాయి 2లో

## 2,200 ఎకరాల్లో పంటనష్టం



రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు, వడగళ్ల వానల వల్ల పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నారాయణపేట, కామారెడ్డి, నిజామాబాద్, నాగర్ కర్నూల్, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక నివేదికలు అందాయని తెలిపారు. తాజాగా కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వానల ప్రభావం, సంభవించిన పంట నష్టంపై మంత్రి ఆరా తీశారు. దాదాపు 2200 ఎకరాల వరకు వరి, మొక్కజొన్న, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని చెప్పారు. పంట నష్టం సంభవించిన ప్రాంతాలను వెంటనే సందర్శించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పూర్తి స్థాయిలో పంట నష్టపోయిన రైతుల వివరాలు వెంటనే సేకరించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. అంతే కాకుండా వరి పంట కోతలు ఊపందుకున్న నేపథ్యంలో వచ్చే రెండు, మూడు వారాల పాటు అన్నదాతలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇలాంటి అకాల వర్షాలు సంభవించే సందర్భంలో పంట నష్టం తగ్గించే విధంగా ముందుగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కర్షకులకు సూచించాలని

తరువాయి 2లో



# ఒడిశాలో పడవ బోల్తా

### 8 మంది జలసమాధి

**భువనేశ్వర్:** ఒడిశాలోని మహానదిలో ఓ పడవ బోల్తా పడింది. ఝార్సుగూడ జిల్లాలో జరిగిన ఈ ప్రమాదంలో ఎనిమిదిమంది జలసమాధి అయ్యారు. దాదాపు 40 మంది ప్రయాణికులను రక్షించారు. ఈ ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ఒడిశా ముఖ్యమంత్రి రూ. 4 లక్షల ఆర్థిక సాయన్ని ప్రకటించారు. శుక్రవారం సాయంత్రం దాదాపు 50 మందికిపైగా ప్రయాణికులతో పథర్సేని కుడా నుంచి బర్గర్ జిల్లాలోని బంజిపాలి వెళ్తుండగా పడవ బోల్తా

తరువాయి 8లో

# జైలులో ఘర్షణ.. ఇద్దరు ఖైదీలు మృతి

**చండీగఢ్:** జైలులో ఖైదీల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు ఖైదీలు మరణించారు. మరో ఇద్దరు ఖైదీలు గాయపడ్డారు. పంజాబ్ సంగ్రూర్‌లోని జైలులో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం రాత్రి 7 గంటలకు నలుగురు ఖైదీలను ఒక సెల్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆ బ్యారక్‌లోకి ప్రవేశించిన తొమ్మిది మంది ఖైదీలు పదుపైన ఆయుధాలతో ఆ నలుగురు ఖైదీలపై దాడి చేశారు. కాగా, ఖైదీల మధ్య ఘర్షణను నివారించేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ సంఘటనలో ఇద్దరు ఖైదీలు మరణించగా మరో

తరువాయి 8లో



# కాషాయ రంగులో దూరదర్శన్ లోగో..

### వివాదం రేపుతున్న కొత్త రంగు

**న్యూఢిల్లీ:** దూరదర్శన్ లోగో రంగును మార్చేశారు. ఆ లోగో రంగును ఎరుపు నుంచి కాషాయానికి మార్చారు. అరెంజ్ రంగులో ఉన్న ఆ లోగోపై వివాదం చెలరేగుతున్నది. దూరదర్శన్‌కు చెందిన డిడి న్యూస్ ఇంగ్లీష్ ఛానల్.. కొత్త రంగులో ఉన్న లోగోను ప్రమోట్ చేస్తూ వీడియోను తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేసింది. విలువలు అలాగే ఉన్నాయని, కానీ మేం ఇప్పుడు కొత్త అవతారంలో దర్శనం ఇస్తున్నామని, గతంలో ఎన్నడూ లేని రీతిలో వార్తా ప్రయాణానికి స్వాగతం అని, డిడి న్యూస్‌ను కొత్తగా అనుభవించండి అంటూ క్యాప్షన్ ఇచ్చారు. లోగో రంగును మార్చడం పట్ల తృణమూల్ ఎంపి జవహర్ సిర్‌చర్ విమర్శలు చేశారు. ఆ లోగో రంగు తగిన విధంగా లేదన్నారు. దూరదర్శన్ లోగోను కాషాయంలోకి మార్చడం చాలా బాధగా ఉందని, ఇప్పుడు ఇది ప్రసార భారతి కాదు అని, ప్రచార భారతిగా

తరువాయి 2లో




# రాజ్యాంగ విలువలు కాపాడుకోవాలి

### దేశ రాజకీయ ఆర్థిక, సామాజిక అంశాలపై అవగాహన రావాలి
### టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజల్లో ప్రశ్నించేతత్వం పెరగడంతో రాజ్యాంగాన్ని తీసేస్తే ఇక అడిగేవారేవ్వరూ ఉండబోరనే ఆలోచన బలపడుతున్నదని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ అన్నారు. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో "ప్రమాదంలో భారత ప్రజాస్వామం" అనే అంశంపైన హైదరాబాద్‌లోని మదీనా ఎడ్యుకేషన్ సొసైటీ హాల్‌లో శనివారం రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోదండరామ్‌తో పాటు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి, ఎస్.వేణుగోపాల్, కన్నెగంటి రవి, సయ్యద్ సలీంపాషా, నిజ్జన రమేష్ ముదిరాజ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల క్రమంలో దేశ రాజకీయాలు, ఆర్థిక, సామాజిక అంశాలపై అవగాహన రావాల్సిన అవసరం ఉన్నదన్నారు. రాజ్యాంగం మనుషులందరికీ సమానత్వాన్ని, సమాన గౌరవాన్ని, అవకాశాలను, రక్షణను కల్పిస్తుందన్నారు. విప్లవాత్మక సామాజికు మార్పునకు రాజ్యాంగం ఎంతో దోహదపడే

తరువాయి 2లో

# కాంగ్రెస్‌ను టచ్ చేస్తే కెసిఆర్‌ను రోడ్డుపై పరుగులు పెట్టిస్తా

### కాంగ్రెస్‌కు కాపలా ఉన్నది రేవంత్‌రెడ్డి
### మెదక్ పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో సిఎం ఫైర్
### ఆగస్టు 15 లోపు రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని హామీ

ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మాజీ సిఎం కెసిఆర్ చీకటి ఒప్పందం చేసుకుని ఎన్ని కుట్రలు పన్నినా, కపట రాజకీయాలు చేసినా రాష్ట్రంలో పదేళ్లు ఇందిరమ్మ రాజ్యమే ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని, పార్టీ ఖాళీ అవుతుందని కెసిఆర్ అంటున్నారని, ఖాళీ అయ్యేందుకు నువ్వు తాగే మందు ఫుల్ బాటిల్ కాదని రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌ను టచ్ చేస్తే కెసిఆర్‌ను రోడ్డుపై పరుగులు పెట్టిస్తానని హెచ్చరించారు. కాంగ్రెస్‌కు కాపలా ఉన్నది రేవంత్‌రెడ్డి అని గుర్తుంచుకోవాలని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థి నీలం మధు తరుపున మెదక్ జిల్లా కేంద్రంలో సిఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర అటవీ, దేవదాయ శాఖమంత్రి, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ కొండా సురేఖ, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ ఎంఎల్‌ఎ మైనంపల్లి రోహిత్‌రావులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ మెదక్ గడ్డకు ఒక చరిత్ర ఉందని, మెదక్ ప్రజలు ఇందిరాగాంధీని గెలిపించి ప్రధానమంత్రిని చేసిన ఘనత మెతుకు సీమదన్నారు. ప్రజా రంజక పాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కళ్ళలో నిప్పులు పోసుకుంటున్నారని, ఆయన కడుపు మండుతుందని దుయ్యబట్టారు. ప్రజాపాలన అంతం చేయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. ఏడుపాయల దుర్గమ్మ, మెదక్ చర్చి సాక్షిగా చెబుతున్నా.. ఆగస్టు 15లోగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని హామీనిచ్చారు. అర్హులైన రైతులందరికి రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే సీజన్‌లో

తరువాయి 2లో

# కొత్త క్రిమినల్ చట్టాల్లో లొసుగులు కనిపెట్టాలి

### నేర న్యాయ సదస్సులో సిజెఐ చంద్రచూడ్



**న్యూఢిల్లీ :** కొత్తగా అమలులోకి రానున్న క్రిమినల్ జస్టిస్ చట్టాలు దేశ చరిత్రలో ఒక మైలు రాయి ఘట్టాన్ని సూచిస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అన్నారు. "నేర న్యాయ వ్యవస్థ నిర్వహణలో భారతదేశ ప్రగతి బాట" అనే అంశంపై న్యూఢిల్లీలో శనివారం జరిగిన ఒక సదస్సులో చంద్రచూడ్ మాట్లాడుతూ, దేశంలో ఇప్పటివరకూ నేరాలను నియంత్రించేందుకు అమలులో ఉన్న క్రిమినల్ చట్టాల వ్యవస్థను సంపూర్ణంగా ప్రక్షాళన చేసి సరికొత్త చట్టాలు తెచ్చారన్నారు. ఈ ఏడాది జులై 1వ తేదీ నుండి నేరాల నియంత్రణకు కొత్తగా చేసిన మూడు చట్టాలు అమలులోకి రానున్నాయి. కొత్త చట్టాలను సంబంధిత వ్యవస్థల ద్వారా విజయవంతంగా అమలు కావాల్సి ఉందన్నారు. ఈ కొత్త చట్టాలను అమలు చేయడం ద్వారా ఎలాంటి లొసులుగు ఉన్నాయనే విషయం మనకు అవగతమతుందనీ, వాటిని తెలుసుకోగలుగుతామనీ, వాటిని కనిపెట్టి ఎక్కడెక్కడ లోపాలు ఉన్నాయో ఆచరణాత్మకంగా

తరువాయి 8లో

# కెసిఆర్ కోటరి వల్లే బిఆర్‌ఎస్‌కు ఈ దుస్థితి

### నాయకత్వంపై విశ్వాసం లేకనే వలసలు
### కాంగ్రెస్ పాలనకు ఏడాది సమయం ఇవ్వాలి
### శాసనమండలి చైర్మన్ గుత్తా

ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి



కెసిఆర్ కోటరి వల్లే బిఆర్‌ఎస్‌కు ఈ దుస్థితి అని, నాయకత్వంపై విశ్వాసం లేకనే గులాబీ నుంచి వలసలు కొనసాగుతున్నాయని, నాయకులు పార్టీని వీడుతున్నారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడిన గుత్తా... బిఆర్‌ఎస్‌లో నెలకొన్న పరిణామాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచే కెసిఆర్ తనకు అపాయింట్‌మెంట్

తరువాయి 2లో

# బిలియనీర్లతో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ముప్పు



**భగల్‌పూర్/న్యూఢిల్లీ:** బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్‌తో పాటు దేశంలోని కొంతమంది బిలియనీర్లు దేశ రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. బీహార్‌లోని భగల్‌పూర్‌లో శనివారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ పాల్గొని ప్రసంగించారు. నరేంద్ర మోదీ పాలనలో బిలియనీర్లకు మాఫీ చేసిన రుణాలు కాంగ్రెస్ నేతృత్వంలోని గత యుపిఎ పాలనలో రైతులుకు చేసిన రుణమాఫీ కంటే 25 రెట్లు అధికమన్నారు. దేశంలో 70 కోట్ల మంది ప్రజల ఆస్తులకు సమానమైన సంపదను కలిగి 22 మంది వ్యక్తులు ఉన్నారన్నారు. దేశంలో 70 కోట్ల మంది ప్రజలు రోజుకు 100 రూపాయల కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారని రాహుల్ పేర్కొన్నారు. 25 మందికి మించకుండా దాదాపు రూ. 16 లక్షల కోట్ల రుణాలను మోదీ మాఫీ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ హయంలో మాఫీ చేసిన రైతుల రుణాలకు ఇది 25

తరువాయి 2లో

# ఉక్రేన్, ఇజ్రాయిల్‌కు 95 బిలియన్ డాలర్ల సహాయం

## అమెరికా దిగువసభలో అరుదైన ఘటన





**వాషింగ్టన్ :** ఉక్రేన్‌కు సుమారు 61 బిలియన్ డాలర్ల సహాయం అందించే పథకానికి ఆమెరికా దిగువసభ ఆమోదించింది. దీర్ఘ కాలంగా ఈ బిల్లు పెండింగ్‌లో ఉంది. దీనికి సంబంధించిన కీల కమైన ఆటంకాలన్నీ తొలగిపోయాయి.ఈ పథకం కింద ఉక్రే న్‌కు 60.8 బిలియన్ డాలర్లు, ఇజ్రాయిల్‌కు 26.4 బిలియన్ డాలర్లు, తైవాన్‌సహా ఇండో పసిఫికక్ రీజియనకు 8.1 బిలియన్ డాలర్ల సహాయం అందుతుంది రిపబ్లికన్లకు డెమోక్రాట్లు పూర్తి సహకారం అందించారు. శనివారం ఈ బిల్లు ఆమోదానికి సిద్ధ మైంది.దీనిని వచ్చేవారం సెనేట్ కూడా ఆమోదించిన తర్వాత దేశాధ్యక్షుడు జో బైడెన్ ఆ ఫైలుపై సంతకం చేస్తారు. గడచిన 26 ఏళ్ళలో ఎన్నడూలేని రీతిలో అధికార ప్రతిపక్ష సభ్యులమధ్య ఈ బిల్లు ఆమోదించడంలో గొప్ప సహాయ సహకారాలు వెల్లివిరి శాయి. ఉక్రేన్, ఇజ్రయిల్, తైవాన్‌లకు మొత్తం 95 బిలియన్ డాలర్ల సహాయం, మానవతా సహాయం అందించేందుకు డెమోక్ర టిక్–రిపబ్లిక్ ఉభయపార్టీలు సంయమనంతో వ్యవహరించాయి. రిపబ్లికన్ స్పీకర్ మైక్ జాన్సన్‌కు డెమోక్రాట్లు పూర్తి సహకారం అందించారు. 316–94 ఓట్లతో ఈ బిల్లు ఆమోదం పొందింది. రెండు నెలలుగా ఈ విషయంలో కసరత్తు జరుగుతున్నది. ఈ వారంలో స్పీకర్ వ్యూహాత్మకంగా వ్యవహరించి అందరినీ ఒప్పిం చారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఉక్రేన్‌పై రష్యా ఆటలు సాగనివ్వబో మని మైక్ జాన్సన్ అన్నారు. డెమోక్రటిక్ లీడర్ హకీమ్ జెఫ్రీ మాట్లాడుతూ గురువారంనాడు తాను స్పీకర్‌తో సంభాషించాననీ, రూల్స్ కమిటీ దీనిని క్లియర్ చేస్తుందని ఆయనఅన్నారన్నారు. ఈ బిల్లు అమెరికన్లకు ఎంతో ముఖ్యమైనదని అందుకే డెమోక్రాట్లు బిల్లును క్లియర్ చేశారన్నారు. ఇదిలా ఉండగా, ఉక్రేన్ దేశాధ్య క్షుడు జెలెన్స్కీ ఒక విజ్ఞప్తి చేస్తూ తమ దేశానికి పేట్రియాటిక్ క్షిప ణులను కూడా సరఫరా చేయాలని కోరారు. నాటో కూడా తమ సభ్య దేశాలకు ఒక విజ్ఞప్తి చేస్తూ ఉక్రేన్‌కు పేట్రియాటిక్ క్షిపణులు సరఫరా చేయాలని కోరింది. దీనిపై జర్మనీ స్పందించి మొత్తం 12 పేట్రియాటిక్ క్షిపణులకుగాను మూడు క్షిపణులను తాము సరఫరా చేస్తా మని ప్రకటించింది.

# ఇజ్రాయిల్ దాడుల్లో 45 మంది మృతి

## రఫాలో గగనతల దాడులు



**గాజా :** ఇజ్రాయిల్ దాడుల్లో 45 మంది మర ణించారు. దక్షిణ గాజాలో ఇజ్రాయిల్ శని వారం గగనతల దాడులు చేసింది. రఫాలో చేసిన దాడుల్లో తొమ్మిదిమంది పాలస్తీనియన్లు మరణించారు. కాగా గడచిన 24 గంటల్లో గాజా ప్రాంతంలో 37 మంది మరణించారు. 68 మంది గాయపడ్డారు. తాజా దాడుల్లోని మృతుల్లో ఆరు గురు పిల్లలు కూడా ఉన్నారు. రఫాలో హమాస్ ఉగ్రవాదులు తలదాచుకున్నారనీ, వారిని మట్టు పెడతామని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నేతన్యాహు శపథం చేశారు. నివాసిత ప్రాంతంపై ఇజ్రా యిల్ ఈ దాడులు చేసింది. మృతదేహాలను రఫాలోని అబు యూసెఫ్ అల్ నజ్జార్ ఆసుపత్రికి తర లించారు.ఈ దాడుల్లో ఒకే కుటుంబానికి చెందిన భార్యభర్త, ముగ్గురు పిల్లలుమరణించారు. ఈజిప్టు సరిహద్దుల్లో ఉన్న రఫా ప్రాంతంలో ప్రస్తుతం కోటీ యాభై లక్షలమంది పాలస్తీనా ప్రజ లకు ఆశ్రయం ఇస్తోంది. గాజా ప్రాంతం పూర్తిగా ధ్వంసం కావడంలో ప్రజలు రఫాలో తలదాచు కున్నారు. పరిస్థితులు విషమిస్తూ ఉండటంతో ఈజిప్టుతో కూడా ఇజ్రాయిల్‌కు సంబంధాలు దెబ్బ తింటున్నాయి. కాగా 24 గంటల్లో మరణించిన పాలస్తీనియన్లు 37 మంది మృతదేహాలను గాజా ఆసుపత్రికి తరలించినట్లు గాజా ఆరోగ్యమంత్రిత్వశాఖ శనివారం ప్రకటించింది.

ప్ర పం చం

# మళ్ళీ ఉత్తర కొరియా హల్‌చల్

## సూపర్ లార్జ్ వార్‌హెడ్, క్రూయిజ్ క్షిపణి ప్రయోగాలు





**పాంగ్‌యాంగ్ :** ఉత్తర కొరియా మరోసారి క్రూయిజ్ క్షిపణి, శక్తిమం తమైన వార్‌హెడ్స్ తనిఖీ ప్రయోగాలతో ఉద్రిక్తతలు సృష్టించింది. యుద్ధ విమానాలను కూల్చివేయగల శక్తివంతమైన కొత్త తరహా సూపర్ లార్జ్ వార్‌హెడ్, క్రూయిజ్ క్షిపణి సామర్థ్యాన్ని తనిఖీ చేసింది. కెసిఎన్ఎ న్యూస్ ఏజన్సీ సమాచారం ప్రకారం హ్వాసాల్ 1, 2 వ్యూహాత్మక క్రూయిజ్ క్షిపణులను, ప్రత్యేకించి అమర్చే అణుశీర్షా లను తయారుచేసింది. శుక్రవారంనాడు ఉత్తరకొరియా ఈ క్రూయిజ్ క్షిపణులను, హ్వాసాల్ 1 రా 3 కోసం డిజైన్ చేసిన సూపర్ లార్జ్ వార్‌హెడ్ శక్తి సామర్థ్యాలను పరిశీలించింది. కొరియా పశ్చిమ సము ద్రంలో ఈ ప్రయోగాలు జరిగాయి. అదే విధంగా ప్యోల్జీ 1,2 కొత్త తరహా యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ క్షిప ణిసహా రెండు పరీక్షలను ఉత్తర కొరియా పూర్తిచే సింది. డిఫెన్స్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు రోజువారీ చేసే కార్యక్రమాల్లో ఇది భాగమేనని ఉ.కొరియా ప్రకటించింది. ఉ.కొరియా ఆ దేశాధినేత కిమ్‌జోంగ్ కొద్దిరోజుల క్రితం గతంలో ఎన్నడూ లేనిరీ తిలో ఇప్పుడు యుద్ధానికి సన్నద్ధం కావలసిన సమయం ఆసన్నమైంది అని ప్రకటించాక జరిగిన ఈ పరీక్షలకు ప్రాధా న్యత ఏర్పడింది.

### 26 వరకు అమెరికా సైనిక విన్యాసాలు

మరోవైపు అమెరికాదక్షిణ కొరియా దేశాలు రెచ్చగొట్టే ధోరణిలో గగనతల విన్యాసాలు చేస్తున్నాయి. ఈ నెల 12 నుండి ప్రారంభమైన ఈ గగనతల విన్యాసాలు ఈనెల 26 వరకూ 14 రోజులపాటు కొనసాగుతాయని దక్షిణ కొరియా ప్రభుత్వం ప్రకటించింది. పెద్ద సంఖ్యలో విమానాలతో ఈ రెండు దేశాలూ సంయుక్త విన్యాసాలు చేస్తూ ఉండటంలో ఉత్తర కొరియా కూడా అందుకు ప్రతీకారంగానే ఈ క్రూయిజ్ క్షిపణి, వార్ హెడ్స్ ప్రయోగాలు చేసింది.

# ఇరాక్ సైనిక స్థావరంపై దాడి

## ఒకరు మృతి, 20మందికి గాయాలు



**బాగ్దాద్ :** సెంట్రల్ సిరియాలో ఉన్న ఇరాక్ సైనిక స్థావరంలో శనివారం తెల్లవారుజామున బాంబు పేలుడు సంభవించింది. దక్షిణ బాగ్దాద్‌కు 50 కిమీ దూరలో ఉన్న కల్సో సైనికస్థావరంలో పిఎంఎఫ్ (పా పులర్ మొబిలైజేషన్ ఫోర్సెస్)లో ఒకరు మరణించారు. 20మంది గాయపడ్డారు. ఇరాన్ అనుకూల షియా ముస్లిం అనుకూల అత్యవసర బృందాలు ఇందులో ఉన్నాయి. పిఎం ఎఫ్ వీరిని ఉపయోగించుకుంటున్నది. ఇరాక్ సైనిక కేంద్రాన్ని పిఎంఎఫ్ వాడుకుంటున్నది. ఈ దాడిలో తమ ప్రమేయం లేదని అమె రికా వివరణ ఇచ్చింది. ఐతే దాడి సమయంలో గగనతలంలో డ్రోన్లు, ఇతర విమానాలూ ఏమీ లేవని భద్రతా సిబ్బంది ధృవీకరించింది. ఇరాన్ మిలి టరీ టెక్నికల్ కమిటీ దీనికి గల కారణాలను పరిశీలిస్తున్నది. గాజాలో యుద్ధం మొదలైనప్పటినుండీ పిఎంఎఫ్ పాలస్తీనియన్లకు మద్దతుగా దాడులు చేస్తున్నది. సిరియా, ఇరాక్‌లలో అమెరికా స్థావరాలపై ఈ బృందం ఫిబ్రవరిలోనే దాడులు ఆపేసింది.

### 22 మంది ప్రభుత్వ అనుకూల ఫైటర్లు హతం

కాగా సెంట్రల్ సిరియాలో జరిగిన గన్‌మెన్ కాల్పుల్లో 22మంది ప్రభుత్వ అనుకూల ఫైటర్లు మరణించారు. భద్రతావర్గాలు శనివారంనాడు ఈ విష యాన్ని వెల్లడించాయి. సుఖ్నా పట్టణ సమీపంలో బస్సులో వెళుతున్న ఫైటర్లపై గురువారంనాడు గన్‌మెన్ కాల్పులు జరిపాడని అసోసియేటెడ్ ప్రెస్ తెలియచేసింది. గన్‌మెన్ కాల్పులు జరిపిన ఘటనలో ఇంతవరకు తామే ఈ దాడికి పాల్పడ్డామని చెప్పుకోకపోయినప్పటి, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులే ఈ దాడికి బాధ్యులై ఉంటారని ప్రభుత్వ అనుకూల మీడియా సిరియా మానవ హక్కుల పరిశీలక సంస్థ లో పేర్కొన్నాయి.

# ప్రధానమంత్రిని నిర్ణయించేది పార్లమెంటే

## క్రొయేషియా అధ్యక్షుడు మిలనోవిక్ వెల్లడి



**జగ్రబ్ :** క్రొయేషియాలో శక్తిబమంతమైన ప్రధానమంత్రి పదవిని చేపట్టేది ఎవరో నిర్ణయించేది పార్లమెంటేతప్ప దేశ అత్యున్నత న్యాయస్థానం కాదని ఆ దేశ అధ్యక్షుడు జొరాన్ మిలనోవిక్ అన్నారు. దక్షిణమధ్య యూరప్, మెడిటేరియన్ ప్రాంత దేశం క్రొయేషియా. మార్చి 18న దేశ పార్లమెం టును మిలనోవిక్ రద్దుచేసి మళ్ళీ ఎన్నికలు నిర్వహించారు. ఈనెల 17న దేశంలో ఎన్నికల పూర్తయి ఫలితాలు కూడా వెలువడ్డాయి. ఎన్నికల తర్వాత మాత్రమే తాను అధ్యక్ష పదవికి రాజీనామా చేసి ప్రధానమంత్రి బాధ్యతలలు చేపడతానని ఆయన ముందుగానే ప్రకటించారు. ఐతే అత్యు న్నత న్యాయస్థానం అందుకు తిరస్కరించి ముందుగా పదవికి రాజీనామా చేయాలని ఆదేశించింది. క్రొయేషియాలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ అమలులో ఉంది. ఎన్నికల తర్వాత శనివారంనాడు కోర్టు ఉత్త ర్వులు ఇస్తూ, ప్రధానమంత్రి పదవి స్వీకరించడానికి అధ్యక్షుడు మిలనో విక్ అర్హుడు కాదని స్పష్టం చేసింది. ఆయన ఎలాంటి శక్తిమంతమైన కూటమి నాయకత్వ బాధ్యతలు కూడా చేపట్టకూడదని కూడా పేర్కొంది. ఐతే సార్వత్రిక ఎన్నికల్లో ఛాందసవాద కన్జర్వేటివ్ పార్టీ ఏకైక పెద్దపా ర్టీగా అవతరించింది. ఇతరుల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసేం దుకు ఆ పార్టీ సన్నాహాలు చేస్తున్నది. క్రొయేషియా డెమోక్రటిక్ యూని యన్ (హెచ్‌డిజెడ్)పార్టీ 60 సీట్లు గెలుచుకుంది. ప్రతిపక్షంగా ఉన్న వామ పక్ష పార్టీ ఎస్‌డిపి 42 సీట్లు గెలుచుకుంది. మిలోనిక్ వామపక్ష కూటమి నాయకుడు. క్రొయేషియా పార్లమెంటులో మొత్తం 151 సీట్లు ఉన్నాయి. మరో మతఛాందస ఉద్యమ పార్టీ 14 సీట్లు గెలుచు కుంది. ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో ఈ 14 సీట్లు గెలుచుకున్న పార్టీయే కింగ్ మేకర్‌గా మారింది. జోరాన్ మిలనోవిక్ ఈ ఎన్నికల ప్రచా రంలో ఉక్రేన్‌కు మరింత యుద్ధ సహాయం అందిం చకూడదని, శాంతిని కాపాడాలని కోరుతూ ప్రజ ల్లోకి వెళ్ళారు. 1991లో మాజీ యుగొస్లావియా నుండి స్వాతంత్రం పొందినప్పటినుండీ ప్రస్తుతం పెద్ద పార్టీగా అవతరిం చిన కన్జర్వేటివ్ హెచ్‌డిజెడ్ పార్టీయే సుధీర్ఘంగా అధికారంలో కొనసాగుతు న్నది. ఈ దేశం 2013లో యూరోపియన్ యూనియన్‌లో చేరింది.

# రైతుకు నష్టం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. రాగల రెండు మూడు రోజుల వరకు అకాల వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలి పారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపు లతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్ష సూచనలు ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఉమ్మడి ఆది లాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో కూడా అకాల వర్షం కురిసింది.

### జనగామలో వర్ష బీభత్సం

జనగామజిల్లా స్టేషన్‌ఘనపూర్, జఫర్‌గడ్, నర్మెట, తరిగొప్పుల మండ లాల్లో వర్షం కురిసింది. నర్మెటలో 5 సెంటీ మీటర్లు, జఫర్‌గడ్‌లో 4.5, స్టేషన్‌ఘనపూర్‌లో 4, తరిగొప్పులలో రెండు సెంటీ మీటర్ల వర్షం కురి సింది. వర్షానికి ముందు గాలి దుమారం రావడంతో పలు చోట్ల మామిడి తోటల్లోని కాయలు రాలిపోయాయి. వరి చేల్ల నేలకు ఒరగా కల్లాల్లోన్ని ధాన్యం తడిసి ముద్దయింది. కమలాపూర్ మండల కేంద్రంలోని వ్యవ సాయ మార్కెట్ యార్డ్‌లో శనివారం కురిసిన అకాల వర్షం కారణంగా రైతులు పండించిన ధాన్యం తడిసిపోయింది. ఇన్ని రోజులు కష్టపడి పండించిన ధాన్యం అకాల వర్షం వల్ల దెబ్బతిందని, ఐకెపి యాజ మాన్యం తడిసిన ధాన్యాన్ని సైతం ఎటువంటి తరుగు లేకుండా మొత్తం ధాన్యాన్ని కొనాలని, వర్షం వల్ల ఎక్కువ దిగుబడి వచ్చే పంట కొంత నష్ట పోయే అవకాశం ఉందని, ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందించి రైతులను ఆదుకోవాలని రైతులు కోరారు. మరి కొంత మంది రైతులు పంట పొలాల వద్దను వడ్లను ఆరబోసి పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కాషాయ రంగులో దూరదర్శన్ లోగో..

(మొదటి పేజీ తరువాయి)

మారిందని మాజీ సిఇఒ తన పోస్టులో విమర్శించారు. గతంలో ప్రసార భారతి సిఇఒగా సిర్‌చర్ బాధ్యతలు నిర్వర్తించారు. 2012 నుంచి 2016 వరకు ఆయన డిడి, ఆల్ ఇండియా రేడియోకు సిఇఒగా చేశారు. లోగోకు కొత్త రంగు వేయడం ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లు అవుతుం దని ఆరోపించారు. అయితే ప్రసార భారతి ప్రస్తుత సిఇఒ మాత్రం సిర్‌చర్ వ్యాఖ్యలను ఖండించారు. విజువల్ ఈస్తటిక్స్‌కు అనుగుణంగా నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆరెంజ్ కలర్ లోగోను తయారు చేసినట్లు ఆయన చెప్పారు. ఛానల్ బ్రాండింగ్, విజువల్ ఈస్తటిక్స్ ఆధారంగా కల ర్‌ను ఎంపిక చేశామని, లోగో ఒక్కటే కాదు, డీడీ ఛానల్ లుక్, ఫీల్‌ను అప్ గ్రేడ్ చేశామన్నారు. కొత్త లైటింగ్, ఎక్విప్మెంట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.

# 2,200 ఎకరాల్లో పంటనష్టం

(మొదటి పేజీ తరువాయి)

అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. 'రాష్ట్రంలో కురిసిన అకాల వర్షం వల్ల పంట నష్టంపై అధికారులతో చర్చించాం. శుక్ర, శనివారాల్లో కురిసిన వర్షం వల్ల పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించాం. రానున్న 3, 4 రోజులు కూడా వర్షాలు ఉన్నాయి. పంట కొనుగోలు కేంద్రాల్లో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి. రైతులకు కావాల్సిన సౌక ర్యాలు అందించాలని అధికారులకు తెలిపాం' అని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత జిల్లా స్థాయి అధికారులు సమన్వయం చేసు కుంటూ వ్యవసాయ మార్కెట్ యార్డులు, ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం బస్తాలు, ఇతర పంటలు తడవకుండా జాగ్రత్తలు తీసుకో వాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. ఇందుకోసం రైతుల సౌకర్యార్థం ఇప్పటికే 2 లక్షలకు పైగా టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

# బిజెపిని రానివ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి)




సిపిఐ మద్దతునిస్తుందన్నారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో ఒకటి, రెండు స్థానాల్లో పోటీచేయాలని సిపిఐ భావించినప్ప టికీ, కొన్ని అనివార్య కారణాలు, బిజెపి ప్రమాదాన్ని నిలువ రించే క్రమంలో తప్పని సరి పరిస్థితుల్లో 'ఇండియా కూటమి' అధికారంలోనికి రావాలని, కాంగ్రెస్ మరింత బలపడాలని ఆయన చెప్పారు. మతోన్మాద బిజెపి అవినీతిపరులను ప్రోత్సహిస్తూ, ఇడి, సిబిఐలను మారణాయుధాలుగా భావి స్తుందని, ప్రజాస్వామ్య గొంతును నులిమివేస్తుందని, మరింత ప్రమాదకా రిగా మారిన బిజెపి తెలంగాణ రాష్ట్రం లో ప్రవేశిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఇష్టమైన వారిని బిజెపి అందలం ఎక్కిస్తుందని దుయ్యబ ట్టారు. దేశంలో పెద్ద అవినీతి పార్టీ బిజెపి అని విమర్శించారు.రూ.13వేల ఎలక్టోరల్ బాండ్స్‌లో రూ.8వేల కోట్ల బాండ్స్ బిజెపికి వచ్చాయని, కాంగ్రెస్‌పార్టీ తన సొంత డబ్బులను ఖర్చు చే సుకోలేని పరిస్థితిని తీసుకొ చ్చారని, అలాగే సిపిఐకి రూ.11కోట్ల జరిమానా విధించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అప్రజాస్వామిక, నిరంకుశత్వంగా ఒక హిట్లర్, నయా ముసోలి మాదిరిగా ఉన్న ప్రధాని మోదీలో రాచరిక లక్షణాలు ఉన్నాయని, పైగా మోదీకి ఆర్‌ఎస్‌ఎస్ స్వేచ్ఛనిచ్చిందని విమర్శించారు. ఎన్నికల మ్యాని ఫెస్టోకు రాజకీయ పార్టీ పేరు పెట్టుకుంటారని, కానీ బిజెపిలో అహంభావం, నిరంకుశత్వం కలిగిన మోదీ పేరుతోనే ''మోడీ గ్యారంటీ'' అని ఎన్నికల మ్యానిఫెస్టోను పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ఇటువంటి అన్యాయమైన కేంద్ర ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. హిందూ,ముస్లింలు కలిసి ఉండాలని, అనేక మంది త్యాగాలు చేశారని, భూస్వాములు, జమిందార్లకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన తెలంగాణ రాష్ట్రంలో బిజెపికి స్థానం ఉండ కూడదని కూనంనేని స్పష్టం చేశారు. కొత్తగూడెంలో మద్దతునిచ్చినందుకు సిపిఐ(ఎం) పట్ల సిపిఐకి ఎప్పటికీ కృతజ్ఞత ఉంటుందని, కానీ తాము కాంగ్రె స్‌తో పొత్తులో ఉన్నామని, మరోవైపు భువనగిరిలో బిజెపి ప్రమాదం ఉన్నదని తెలిపారు. కమ్యూనిస్టులంతా ఎప్పటికీ కలిసే ఉంటామని, ప్రజా సమస్య లపై కలిసే పోరాడుతామని తెలిపారు. ఎన్నికలు వచ్చే సరికే సిపిఐ, సిపి ఐ(ఎం) రెండు పార్టీలు బలంగా ఉండాలన్నారు. భవిష్యత్‌లో అనేక ఎన్ని కలు ఉంటాయని, తాము మళ్లీ పుంజుకుని, గౌరవప్రదమైన స్థానాల్లో ఉంటా మని కూనంనేని తెలిపారు.

# విలువలు కాపాడుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ఉంటుందని చెప్పారు. ఆర్థిక రంగంలో ఉన్న ఇబ్బందుల కార ణంగా ప్రశ్నించడం మొదలైందన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన రాజకీయమే నేడు సమస్యగా మారు తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రధానితో పాటు కేంద్ర మంత్రులు, బిజెపి నేతల మాటలలో సత్యాన్ని వెతుక్కునే పరిస్థితి నెలకొన్న దని, సమాచారం కలుషితమైందన్నారు. దేశ భక్తి కలిగిన తమ వంటి వారు నిత్యం ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే, దేశద్రోహులని ముద్ర వేస్తున్నారని విమ ర్శించారు. ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న వారిపైన ఉపా వంటి చట్టాలను ఉప యోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డి.నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో ప్రస్తుతం ఐదవ స్థానంలో ఉన్న భారతదేశం మూడవ స్థానానికి వెళ్తుందని, ఎంతో గొప్పగా చెబుతున్నారని, ఇంతకు ఐదవ స్థానా నికి రావడం వల్ల ప్రజలకు కలిగిన ఉపయోగం ఏమిటని ప్రశ్నించారు. మూడవ స్థానంలో వచ్చినా, మన తలసరి ఆదయం మాత్రం ప్రపంచంలోనే 132వ స్థానంలోనే ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ఆదాయం పెరెగేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకున్న జిఎస్‌టి, నోట్ల రద్దు నిర్ణయంతో చిన్న,,మద్యత రహా పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వ్యవసాయ ఉపాధి కూడా తగ్గిందని వివరించారు.

# రోడ్డుపై పరుగులు పెట్టిస్తా

(మొదటి పేజీ తరువాయి)

వరి పంటకు రూ.500 బోనస్ ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. పేదవా రికి అండదండగా ఉండేది మూడు రంగుల జెండానే అన్నారు. కాంగ్రెస్ పథ కాలు చూసి ఓర్వలేక మాజీ సిఎం కెసిఆర్ పిట్టల దొరలా మారారని, ఏదేదో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ గురించి మాట్లాడితే మాడి మసై పోతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను జైపాల్ రెడ్డినో, జానారెడ్డినో కాదని తెలుసుకోవాలని హితవు పలికారు. గతంలో మహిళల కష్టాలు చూడలేక సిలిండర్లు, స్టవ్ పొయ్యిలు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని గుర్తు చేశారు. మెదక్ జిల్లాలో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చారో కెసిఆర్ సమాధానం చెప్పా లని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే మెదక్ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో బలహీన వర్గాల ముదిరాజ్ బిడ్డ, ఇందిరమ్మ వార సుడు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలి పించాలని మెదక్ పార్లమెంటు నియోజకవర్గ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్ని కల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఢిల్లీలో రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలన్నారు. మాజీ సిఎం కెసిఆర్ అధికారంలో ఉన్నట్టే మాట్లా డుతున్నారని, తెలంగాణ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టిన ఇంకా బుద్ధి రాలే దని విమర్శించారు. మెదక్ ఎంపిగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీని గెలి పించి ప్రధానమంత్రి చేసిన ఘనత మెదక్ జిల్లా ప్రజలదని మంత్రి రాజన ర్సింహ్మ పేర్కొన్నారు. ఎన్ని పార్టీలు అడ్డు వచ్చిననానీలం మధుదే గెలుపు అని మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు.

### పేదింటి బిడ్డగా గెలిపించండి : మధు

కాంగ్రెస్ పార్టీ తనను బిసి బిడ్డగా ఆశీర్వదించి, ఎంపి అభ్యర్థిగా అవకాశం ఇచ్చిందని, అందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి పాదాభివందనాలు తెలియజే స్తున్నానని నీలం మధు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే అభివృద్ధి సేవ చేస్తూ మెదక్ ప్రజల రుణం తీర్చుకుంటానని మధు తెలిపారు. కార్యక్ర మంలో మెదక్ ఎంఎల్ రోహిత్ రావు, మాజీ ఎంఎల్ఎ హనుమంతరావు, నర్సాపూర్ మాజీ ఎంఎల్ఎ మదన్‌రెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, ఆవుల రాజిరెడ్డి, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ తది తరులు ఉన్నారు.

# బిఆర్‌ఎస్‌కు ఈ దుస్థితి

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వలేదన్నారు. బిఆర్‌ఎస్‌లో ఎంఎల్‌ఏ కేంద్రంగా రాజకీయాలు సాగుతున్నాయని, పార్టీలో పరిస్థితులు, ఓటమిపై అంతర్గత సమీక్ష లకు అవకాశం లేకుండా పోయిందన్నారు. పార్టీలో గ్రామ, మండల, జిల్లా శాఖలు లేవని, సంస్థాగత నిర్మాణం లేదన్నారు. ప్రజాస్వామ్యబ ద్ధంగా పార్టీలు నడవాల్సిన అవసరం ఉందని తెలి పారు. బిఆర్‌ఎస్‌లో సంస్థాగత మార్పులు అవసర మని, కెసిఆర్‌ను విమర్శించే నెపం ఆయన మీద నెట్టడం తన ఉద్దేశం కాదన్నారు. పార్టీ విధానాల్లో మార్పు రాకపోతే తీవ్ర నష్టం తప్పదని, ఓటమిపై సమక్ష జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. తాను పార్టీ మారనని, అలాంటి ఆలోచన ప్రస్తుతా నికి లేదని స్పష్టం చేశారు. ఉద్యమకారుల పేరుతో అధికారంలోకి వచ్చిన బిఆర్‌ఎస్‌లో చాలామంది కోటీశ్వరులు అయ్యారని ఆరోపించారు. నల్ల గొండ జిల్లాలో కొందరు లిల్లీపుట్‌లను తయారు చేశారని విమర్శించారు. బిఆర్‌ఎస్‌లో అంతర్గత సమస్యలు నేతల సహాయ నిరాకరణతోనే ఎంపి ఎన్నికల్లో తన కుమారుడు అమిత్ పోటీ నుంచి వెనక్కి తగ్గాడని స్పష్టం చేశారు. నేతలు అవినీతి, అహంకార పూరితంగా వ్యవహరించడంతో ప్రజ లకు పార్టీ దూరమైందన్నారు. పల్లీలు, బఠానీలు అమ్ముకునే నేతలు కోట్లకు పడగలెత్తారని ఆరో పించారు. ఎంతసేపు ఎదుటి వారిపై చాడీలు చెప్పే నేతలే కెసిఆర్ కోటరిలో కొనసాగుతున్నార న్నారు. వారితోనే పార్టీ ప్రజలకు దూరమైంద న్నారు. ఆ విషయం కార్యకర్తలు అందరికీ తెలుస న్నారు. తనను విమర్శించే బిఆర్‌ఎస్ నేతలు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. త్వరలో వారి బండారం బయటపెడతానని గుత్తా వెల్లడించారు. గతంలో తనకు కెసిఆర్ ఇచ్చిన మంత్రి పదవి హామీతోనే బిఆర్‌ఎస్‌లో చేరడం జరిగిందన్నారు. కానీ కెసిఆర్ ఆ మాట నిలబెట్టుకోలేదన్నారు. ప్రస్తుతం తాను ఏ పార్టీతో సంబంధం లేని రాజ్యాంగబద్ధ పదవి అయిన శాసనమండలి చైర్మన్ హోదాలో ఉన్నానని చెప్పారు. పార్టీ మారిన ఎమ్మెల్సీల అనర్హత కు సంబంధించి ఫిర్యాదులను రాజ్యాంగ ప్రకారం న్యాయ నిపు ణుల సలహాలతో నిష్పాక్షికంగా పరిష్కరించే ప్రయత్నం చేస్తానన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాల నపై ప్రజల్లో భారీ అంచనాలు ఉన్నాయని ఎన్ని కల్లో అనేక హామీలు ఇవ్వడం, ఖజానా ఖాళీగా ఉండడంతో కనీసం ఏడాది పాటైన ప్రభుత్వానికి సమయం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అధికా రంలో ఏ పార్టీ ఉన్న ప్రజల ఆకాంక్షల మేరకు పని చేయకపోతే ప్రజా వ్యతిరేకత ఎదుర్కొనక తప్పదన్నారు.

# ప్రజాస్వామ్యానికి ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

రెట్లు ఎక్కువ అని మీరు గ్రహించారా? అని ప్రశ్నించారు. ఇది ఉపాధిహామీ పథకం కోసం 25 సంవత్సరాల ఖర్చుతో సమా నంగా చూడవచ్చు అని చెప్పారు. కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇం డియా' కూటమి పేద ప్రజలకు సంపదను పంచడానికి కట్టు బడి ఉందని రాహుల్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, ప్రతి పేద కుటుంబంలోని ఒక మహిళకు ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా లక్ష రూపాయల వార్షిక డోల్‌ను ప్రతిపాదిస్తున్న 'మహాలక్ష్మి' వంటి పథకాల ద్వారా పేదలకు సహాయం చేస్తా మన్నారు. డబ్బు ఒక వ్యక్తి బ్యాంకు ఖాతాలోకి చేరుతుందని, కానీ మొత్తం కుటుంబం ఉపయోగించుకోవచ్చన్నారు. మన ప్రధాని ప్రజల చుట్టూ ఉన్న పరిస్థితులపై దృష్టి పెట్టాలని కోరు కోవడం లేదని, కొన్ని మార్గాల ద్వారా అందరి దృష్టి మరల్చ డానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. దేశంలోని ఏ ప్రాంతంలోనైనా, యువకులు తమ స్మార్ట్‌ఫోన్‌లలో గంటల కొద్దీ పనిలేకుండా, సోషల్ మీడియా సైట్‌లకు అతుక్కుపోతుం డడం చూస్తున్నామని, దానికి కారణం భారతదేశం నిరుద్యోగ కేంద్రంగా మారడమేనన్నారు. నోట్ల రద్దు, జిఎస్‌టి అమలు వల్ల ఉద్యోగాల కల్పన దెబ్బతిన్నదన్నారు. నాలుగు సంవత్స రాల పాటు కాంట్రాక్టు ఉద్యోగాలను ఇచ్చే వఅగ్నిపథ్' పథ కాన్ని కాంగ్రెస్ రద్దు చేస్తుందని, దేశ ప్రజలు ఈ వ్యవస్థను ధిక్క రిస్తున్నారని పేర్కొన్నారు. సైనికులలో రెండు వేర్వేరు వర్గాలు ఉండకూడదన్నారు.

### అవినీతి పాఠశాలను నడుపుతున్న మోదీ

ఎలక్టోరల్ బాండ్ల అంశంపై ప్రధాని నరేంద్రమోదీపై రాహుల్ గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. దేశంలో అవినీతి స్కూల్‌ను నడుపుతున్నారని, అవినీతి శాస్త్రంలోని అన్ని అధ్యా యాలను బోధిస్తున్నారని ఆరోపించారు. ఎలక్టోరల్ బాండ్ల అంశంపై బిజెపిని విమర్శిస్తూ ఎలక్టోరల్ బాండ్ల సమస్యపై బిజెపిపై విమర్శలు చేసే కొత్త కాంగ్రెస్ ప్రకటన వీడియోను రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో షేర్ చేశారు. అవినీతి పాఠశాలను నడుపుతున్న నరేంద్రమోదీ విరాళ వ్యాపారంతో సహా అవినీ తిలో ప్రతి అధ్యాయాన్ని వివరంగా బోధిస్తున్నారని పోస్టు చేశారు. దాడుల ద్వారా విరాళాల సేకరణ ఎలా జరుగు తుందో, విరాళాలు తీసుకున్న తర్వాత కాంట్రాక్టులు ఎలా పంపిణీ చేస్తారో అనే అధ్యాయాలను ప్రధాని బోధిస్తున్నార న్నారు. అవినీతిపరులను కడిగే వాషింగ్ మెషీన్ ఎలా పని చేస్తుందో.. ఏజెన్సీలను రికవరీ ఏజెంట్లుగా మార్చి 'బెయిల్ అండ్ జైల్ గేమ్ ఎలా ఆడుతోంది మనం చూస్తున్నామన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా అదే ప్రకటనను 'ఎక్స్'లో పంచుకున్నారు. 'హఫ్తా వాసులీ ప్రభుత్వాన్ని ఎన్ను కోవద్దు, మార్పును ఎంచుకోండి. కాంగ్రెస్‌కు ఓటు వేయండి' అని పిలుపునిచ్చారు. 'అవినీతిపరుల డెన్'గా మారిన బిజెపి తన నాయకులకు ఈ 'క్రాష్ కోర్సు'ని తప్పనిసరి చేసిందని, దానికి దేశం మూల్యం చెల్లిస్తోందని రాహుల్ హెచ్చరించారు. రానున్న ఇండియా కూటమి ప్రభుత్వం ఈ 'అవినీతి పాఠశా ల'ను మూసివేస్తుందని, ఈ కోర్సును శాశ్వతంగా రద్దు చేస్తుం దని హామీనిచ్చారు.

ప్రజాపక్షం | హైదరాబాద్ | ఆదివారం | 21 ఏప్రిల్, 2024 | 3




# 18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024

| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |

## సోషల్ ప్లాట్‌ఫామ్స్ హడావుడి

ఏడు దశల్లో జరిగే సార్వత్రిక ఎన్నికల మొదటి ఘట్టం శుక్రవారం ప్రారంభమైన నేపథ్యంలో, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో హడావుడి తారస్థాయికి చేరింది. ఓటు హక్కు ను వినియోగించుకోవడంపై అవగాహన పెంచడం నుంచి రాజకీయ ప్రత్యర్థులపై దాడి చేయడం వరకూ ఎన్నో అంశాలపై మీమ్స్‌తో సామాజిక మాధ్యమాలు నిండిపోతు న్నాయి. ఇన్‌స్టాగ్రామ్ నుంచి 'ఎక్స్' వరకూ, అన్నిరకాల సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో వివిధ రాజకీయ పార్టీల అను కూల, వ్యతిరేక వర్గాల మధ్య పెద్ద యుద్ధమే జరుగుతున్నది. అయితే, తీవ్రమైన నిందారోపణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యల స్థానంలోనే వ్యంగ్యంగా విమర్శించే విధానం కొనసాగుతున్నది. మొదటిసారి తమ ఓటు హక్కును వినియోగించుకోనున్న యువతను ఉద్దేశించి భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) కొన్ని చమత్కారమైన లైన్లు లేదా డైలాగులను ఉపయోగించి, వారిని ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అదే ఒరవడి రాజకీయ పార్టీలు, అభ్యర్థుల వర్గాలు అనుసరిస్తున్నాయి. ఈసారి ఎన్నికలను 'చునావ్ కా పర్వ్' (ప్రజాస్వామ్య పండుగ) గా ఇసిఐ అభివర్ణించడం ఆకట్టుకుంటున్నది. ఇందు కోసం ఉద్దేశించిన ఓ ప్రకటనలో, 'పధరో హమ్రే బూత్' (మన బూత్‌కు వెళదాం) అని చెప్తున్న ఓ రాజస్థానీ ఓటర్‌ను చూపడం కూడా అందరినీ ఆకట్టుకుంటున్నది. అమూల్ తన వ్యాపార ప్రకటనలో ఎన్నికలను జొప్పించడం ఒక కొత్త ప్రయోగం. 'ప్రపంచంలోని గొప్ప ఎన్నికలు... అమూల్ మీకు ఇష్టమైన ఎంపిక' అంటూ, ఒకవైపు ఓటు గురించి చెప్తూనే, తన ఉత్పత్తి అమ్మకాలవైపు ప్రజలను ఆకర్షించే సింగిల్ లైన్ ట్యాగ్‌తో దూసుకెళుతున్నది. ప్రతి ఓటరూ తమ కుటుంబం, స్నేహితులతో బయటకు వచ్చి ఓటు వేయాలని ఇసిఐ విజ్ఞప్తి చేస్తుంటే, 'ది ఫ్యామిలీ మన్' అనే వెబ్ సిరీస్‌లో ఫన్నీ మీమ్ ను విడుదల చేసింది. ఒక పార్టీకి అనుకూలం గా ఉన్న ఈ పోస్టుతో నెటిజన్లు పార్టీల వారీగా విడిపోయారనే చెప్పాలి. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) విడుదల చేసిన ఒక పోస్టర్‌లో 'మోదీకో హఠానా హై.. క్యోకీ..' (మోదీని తప్పించాలి. ఎందుకంటే..) అంటూ బిజెపి వైఫల్యాలు ప్రస్తావించింది. 'బిజెపి హఠావో.. సంవిధాన్ బచావో' (మోదీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని రక్షించండి) అనే మరో ప్రకటన కూడా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నది. 'బేరోజ్‌గారీ బహుత్ హై.. బాకీ సబ్ ఠీక్ హై' (నిరుద్యోగమే చాలా ఎక్కువగా ఉంది. మిగతా అంతా బాగా నే ఉంది) అనే వ్యంగ్య ట్యాగ్‌తో సోషల్ మీడియాలో కాంగ్రెస్ తన ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేసింది. మొత్తం మీద ఇప్పుడు సోష ల్ మీడియా మొత్తం ఎన్నికల ట్యాగ్స్.. మీమ్స్ తో నిండిపోతున్నది. తుది విడత పోలింగ్ జరిగే జూన్ ఒకటో తేదీ వరకూ ఈ ఒరవడి కొనసాగడం ఖాయం.



## బిజెపిని ఇరుకున పెట్టిన ఎలక్టోరల్ బాండ్స్

ఎలక్టోరల్ బాండ్స్ పథకం (ఇబిఎస్) ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఇరుకున పెట్టింది. ఈ పథకం ద్వారా ఎక్కువ లాభపడిన పార్టీ బిజెపియే కావడంతో, క్విడ్ ప్రోకో (పరస్పర ప్రయోజనాలు) అంశం తెరపైకి వచ్చింది. ఈ పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమంటూ సుప్రీం కోర్టు కొట్టివేయడంతో మోడీ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలతోనే దీనిని తీసుకువచ్చిందనే విషయం స్పష్టమైంది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు, భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)కి ఈ బాండ్లను విడుదల చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఇచ్చిన సమాచారం ప్రకారం 2019 ఏప్రిల్ నుంచి 2024 జనవరి మధ్యకాలంలో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా ప్రాంతీయ పార్టీలు రూ. 5,221 కోట్లకు పైగా విరాళాలు అందుకున్నాయి. అదే సమయంలో బిజెపికి వచ్చిన మొత్తం రూ. 6,060.51 కోట్లు. అంటే ప్రాంతీయ పార్టీలన్నీ కలిపినా, బిజెపి కంటే రూ. 839 కోట్లు తక్కువ బాండ్లను పొందాయి. ప్రాంతీయ పార్టీలలో, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) మాత్రమే అత్యధికంగా రూ. 1,609.53 కోట్లు సేకరించింది. ఇది ఎలక్టోరల్ బాండ్ల ద్వారా నిధులు పొందిన 22 ప్రాంతీయ పార్టీలు అందుకున్న మొత్తం విరాళాలలో 30 శాతం. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) రూ.1,214.70 కోట్లు, బిజెడి రూ.775.50 కోట్లు, డిఎంకె రూ.639 కోట్లు, వైఎస్‌ఆర్‌సిపి రూ.337 కోట్లు, టిడిపి రూ.218.88 కోట్లు, శివసేన 159.38 కోట్లు చొప్పున సమీకరించుకున్నాయి. కాగా, ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ డైరెక్టర్ లాటరీ మాగ్నెట్ శాంటియాగో మార్టిన్ రూ. 1,368 విలువైన బాండ్లను కొనుగోలు చేశాడు. అత్యధిక మొత్తాల్లో ఈ బాండ్లను కొన్న వారి జాబితాలో ఆయనదే అగ్రస్థానం. కోయంబత్తూరుకు చెందిన ఫ్యూచర్ గేమింగ్ భారతదేశంలోని అతిపెద్ద లాటరీ కంపెనీలలో ఒకటి. దాని వ్యవస్థాపకుడు శాంటియాగో మార్టిన్. ఈ కంపెనీపై 2022 మార్చిలో ఇడి దాడులు చేసింది. విచారణ జరిపింది. ఆతర్వాత కంపెనీ బాండ్లను కొనడం, తదుపిమ్మట ఇడి విచారణ నిలిచిపోవడం ఎన్నో అనుమానాలకు తావిస్తున్నది. కుంభకోణాలు, మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని ఆరోపిస్తూ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చీఫ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నుంచి




బిఆర్‌ఎస్ నాయకురాలు, తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వరకూ ఎంతో మందిని ఇడి అరెస్టు చేసిన ఇడి, భారీగా బాండ్లను కొన్న కంపెనీలపై విచారణను ఎందుకు అటకెక్కించందనే ప్రశ్నకు సమాధానం లేదు. బిజెపి తెర వెనుక నుంచి ఆ నాటకాన్ని ఆడిస్తున్నదన్న వాదనను ప్రతిపక్షాలు బలంగానే ప్రజల్లోకి తీసుకెళ్లాయి.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో అనుమానితుడిగా అరెస్టయిన అరబిందో ఫార్మా డైరెక్టర్ శరత్ చంద్రాడ్డి కూడా విరాళాలిచ్చిన వారి జాబితాలో ఉన్నారు. అరెస్టుకు ఐదు రోజుల ముందు, అంటే 2022 నవంబర్ 15వ తేదీన ఆయన కంపెనీ 5 కోట్ల రూపాయల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసింది. ఆ మొత్తాన్ని 21వ తేదీన బిజెపి తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత అరబిందో ఫార్మా 50 కోట్ల రూపాయల బాండ్లు కొన్నదని, తదనంతరం, 2023 ౖ 8న ఆయనకు బెయిల్ లభించిందని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) చేస్తున్నవిమర్శలపై బిజెపి వద్ద ఎలాంటి జవాబు లేదు. కాగా, హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఎలక్టోరల్ బాండ్ల రూపంలో వివిధ పార్టీలకు రూ. 966 కోట్లు ఇచ్చింది. 1989లో స్థాపించిన ఈ సంస్థ తయారీ, ఇంజినీరింగ్ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. మేఘాతో అనుబంధం ఉన్న మూడు కంపెనీలు కూడా భారీగానే విరాళాలు అందించాయి. ఫలితంగా, ఈ గ్రూప్ మొత్తం విరాళం రూ. 1200 కోట్లకు చేరుకుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎన్నో ప్రాజెక్టులు పొందిన మేఘా కంపెనీకి వచ్చిన కాంట్రాక్టుల్లో రక్షణ శాఖ నుంచి రూ. 500 కోట్ల రూపాయల విలువైన ఆర్డర్ కూడా ఉంది. క్యుడబ్ల్యుఐకె సప్లయి చైన్ ప్రైవేట్ లిమిటెడ్ నవీ ముంబయిలోని ధీరూభాయ్ అంబానీ నాలెడ్జి సిటీ (డిఎకెసి) చిరునామాతో రిజిస్టరైంది.

రిలయన్స్ కంపెనీతో సంబంధం ఉన్న ఈ కంపెనీ గురించి ఎవరికీ పెద్దగా అవగాహన లేదు. కానీ, ఎలక్టోరల్ బాండ్ల విషయంలో మాత్రం ఈ కంపెనీ ముందు వరుసలోనే ఉంది. 2021—22 నుంచి 2023—24 ఆర్థిక సంవత్సరాల మధ్యకాలంలో ఈ కంపెనీ ఏకంగా 410 కోట్ల రూపాయల విలువైన ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసింది. ఈ కంపెనీ తమకు అనుబంధ సంస్థకాదని రిలయన్స్ ప్రకటించినప్పటికీ, దాని మూలాలు మాత్రం అక్కడే ఉన్నాయి. టోరెంట్ పవ్స్, డిఎల్‌ఫ్ కమర్షియల్ డెవలపర్స్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, పిరమల్ ఎంటర్‌ప్రైజెస్, అపోలో టైర్స్, ఎడెల్విస్, కెవెంటర్, సూలా వైన్స్, సన్ ఫార్మా, వర్ధమాన్ టెక్స్‌టైల్స్, జిందాల్ గ్రూప్, ఫిలిప్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్, సియట్ టైర్స్, డాక్టర్ సిప్లా, అల్ట్రాటెక్ సిమెంట్ వంటి కంపెనీలు కూడా భారీగానే ఎలక్టోరల్ బాండ్లను కొన్నాయి. అత్యధిక శాతం మొత్తం బిజెపి ఖాతాల్లోనే చేరాయి. నల్ల ధనాన్ని అధికారికంగా మార్కెట్‌లోకి తెచ్చేందుకు వేసిన రాచమార్గంగా ఎలక్టోరల్ బాండ్స్‌ను ప్రతిపక్ష పార్టీలు పేర్కొంటున్నాయి.

ఎలాంటి ప్రయోజనాలు ఆశించకుండా, కోట్లాది రూపాయల విరాళాలు ఎందుకు ఇస్తారని ప్రజలే ప్రశ్నిస్తున్నారు. విరాళాలిచ్చిన కంపెనీల్లో భారీగా నష్టాలు మూటగట్టుకుంటున్నవి కూడా ఉన్నాయి. సుంకాల తగ్గింపు, ఉద్దీపన ప్యాకేజీలు, రుణ మాఫీ వంటి ప్రతిఫలాలను కేంద్రం నుంచి ఆశించే, ఆయా కంపెనీలు భారీగా విరాళాలిచ్చాయన్నది బహిరంగంగా వినిపిస్తున్న వాదన. సమాధానం లేక ఇరుకున పడిన బిజెపి రాబోయే ఎన్నికల్లో ఎలక్టోరల్ బాండ్ల కారణంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందేమో!

## ఊరూపేరూ లేని పార్టీలు..

దేశ స్వాతంత్ర్యానంతరం ఇప్పటి వరకూ జరిగిన సాధారణ ఎన్నికల్లో కేవలం ఆరు రాజకీయ పార్టీలు మాత్రమే విరామం లేకుండా పోటీ చేశాయి. 25పార్టీలు కనీసం పది ఎన్నికల్లో పోటీ పడ్డాయి. చాలావరకు పార్టీలు కేవలం ఒకటి లేదా రెండు ఎన్నికలకే పరిమితమయ్యాయి. ఇలాంటి ఊరూపేరూ లేని పార్టీలు క్రమంగా పెరగడం భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో తలనొప్పి అంశంగా మారింది. అశోక విశ్వవిద్యాలయం త్రివేది సెంటర్ ఫర్ పొలిటికల్ డేటా (టిసిపిడి) అధ్యయనం ప్రకారం, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశంలో బహుళ పార్టీ విధానం చాలా సందర్భాల్లో దుర్వినియోగమవుతున్నది. అవాంఛనీయ పోకడలు ఉద్భవిస్తున్నాయి. ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం చూపని పార్టీల్లో చాలా వరకూ ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు తమ కోసం ఏర్పాటు చేసుకున్నవే కావడం గమనార్హం. భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) వద్ద నమోదైనప్పటికీ, ఎన్నికల్లో పోటీ చేయని పార్టీలు కూడా ఉన్నాయంటే ఆశ్చర్యం కలగక మానదు.

సాధారణ ఎన్నికల్లో ఇప్పటి వరకూ 1,406 పార్టీలు పోటీ చేశాయి. వీటిలో 91 శాతం పార్టీలు ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయాయి. ఈ పార్టీల తరఫున ఇప్పటివరకు 9,809 మంది అభ్యర్థులు పోటీపడగా, ఒక్కరు కూడా గెలవలేదు. కనీసం ఐదు ఎన్నికల్లో పోటీ చేసిన 41 పార్టీలు కూడా ఖాతా తెరవని పరిస్థితి. సార్వత్రిక ఎన్నికల్లో 9 పర్యాయాలు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 26 పర్యాయాలు పోటీ చేసిన ఆమ్ర బంగాలీ పార్టీ, ప్రతిసారీ ఓటమినే చవిచూసింది. పశ్చిమ బెంగాలకే పరిమితం కాకుండా, ఈ పార్టీ ఐదు రాష్ట్రాల్లో, ఇప్పటి వరకూ కనీసం వంద మంది అభ్యర్థులు పోటీకి దింపింది. ఒక్క సీటూ గెలవకపోయినప్పటికీ, పట్టువదలకుండా అభ్యర్థులను ప్రకటిస్తునే ఉంది. ఇలాంటిదే మరో పార్టీ శోషిత్ సమాజ్ దళ్ (ఎస్‌ఎస్ డి). ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో 22 పర్యాయాలు ఈ పార్టీ పోటీ చేసింది. 353 మంది అభ్యర్థులను బరిలోకి దించింది. ఎంత కష్టపడినా, ఇప్పటి వరకూ కేవలం ముగ్గురిని మాత్రమే గెలిపించుకోగలిగింది.

ప్రాంతీయ స్థాయి పార్టీల గురించి ఎంత తక్కువగా చెప్తే అంత మంచిది. అత్యంత దారుణంగా విఫలమవుతున్నప్పటికీ, పదేపదే ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టడం, ఓటమి చవిచూడడంలో ఇలాంటి అనామాక పార్టీలు పొందుతున్న ఆనందం ఏమిటో?

## చర్చనీయాంశంగా వరంగల్ పార్లమెంట్ అభ్యర్థులు

### మూడు పార్టీల నుండి ముగ్గురు... ఎవరికి పట్టమో..?

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** వరంగల్ పార్లమెంట్ నుండి పోటీచేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు ముగ్గురూ నెల రోజులకు ముందు బిఆర్‌ఎస్ వాళ్లే. వారే ఒకరిపై ఒకరు పోటీ పడుతున్నారు. ఆ ముగ్గురిలో ఒకరు బిజెపి నుండి, మరొకరు కాంగ్రెస్ నుండి పోటీ చేస్తుండగా ఒకరు బిఆర్‌ఎస్ నుండి పోటీ చేస్తున్నారు. ఆ ముగ్గురిలో వరంగల్ ఓటర్లు ఎవరికి పట్టం కడతార్నది చర్చనీయాంశంగా మారింది. అయితే ముగ్గురిలో ఇద్దరు వరంగల్ పార్లమెంట్ పరిధిలోని వారు కాగా ఒకరు మాత్రం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని వారు.





పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ నుండి కడియం కావ్య, ఆరూరి రమేష్, సుధీర్‌బాబు పోటీ చేస్తున్నారు. కడియం కావ్య కాంగ్రెస్ నుండి పోటీ చేస్తుండగా ఈమె తండ్రి కడియం శ్రీహరి బిఆర్‌ఎస్. అసెంబ్లీ ఎన్నికల్లో కడియం శ్రీహరి స్టేషన్‌ఘనపూర్ నుండి ఎంఎల్‌ఏగా గెలుపొందారు. ఆయన కూతురు కావ్య బిఆర్‌ఎస్ కాగా టిక్కెట్టు కూడా ఇచ్చారు. బిఆర్‌ఎస్ నుండి గెలవడం కష్టమని భావించిన కావ్య కాంగ్రెస్ గూటికి చేరి బరిలోకి దిగారు. అయితే ఎన్నికల ముందు మాత్రం కావ్య బిఆర్‌ఎస్ అనేది మాత్రం నిజం. ఇక బిజెపి నుండి పోటీ చేస్తున్న ఆరూరి రమేష్ కూడా బిఆర్‌ఎస్. ఆయన వర్ధన్నపేట నుండి ఎంఎల్ఏగా పనిచేశారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. మొదటగా బిఆర్‌ఎస్ టిక్కెట్టు ఆశించి భంగపడ్డారు. అధిష్టాన నిర్ణయం నచ్చకపోవడంతో బిజెపిలో చేరారు. ఇప్పుడు ఆ పార్టీ నుండి పోటీ చేస్తున్నారు. ఈయన 15 రోజుల ముందు వరకు కూడా బిఆర్‌ఎస్. ఇక బిఆర్‌ఎస్ నుండి పోటీ చేస్తున్న సుధీర్ బాబు అదే పార్టీ నుండి పోటీ చేస్తున్నారు. హన్మకొండ జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న సుధీర్‌బాబుకు చివరి దశలో టిక్కెట్టు దక్కింది. అయితే ఈయన పెద్దగా బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకే తెలియని పరిస్థితి. ఏ సభల్లో కూడా ఎక్కువగా కనిపించ లేదు. ఈయన హుస్నాబాద్ నియోజకవర్గానికి చెందిన వ్యక్తి, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోకి వస్తుంది. అయితే పోటీలో ఉన్న ముగ్గురు నెల రోజుల ముందు వరకు బిఆర్‌ఎస్‌కు చెందిన వారు కావడంతో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వారంతా బిఆర్‌ఎస్ వాళ్లే అంటు చర్చించుకుంటున్నారు ఓటర్లు.

**ఎవరిని ఆదరిస్తారో..**

వరంగల్ పార్లమెంట్ నుండి ప్రధాన పార్టీల అభ్యర్థులుగా ముగ్గురు పోటీ చేస్తున్నారు. ఈ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా వాటికి కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహిస్తుంది. భూపాలపల్లి ఎంఎల్ఏగా గండ్ర సత్యనారాయణ ఉండగా ఆయన కడియం కావ్య కోసం కష్టపడి పనిచేస్తున్నట్లు కనిపిస్తుంది. ఇక పరకాల ఎంఎల్ఏ రేవూరి ప్రకాష్‌రెడ్డి పార్లమెంట్ ఇన్‌చార్జీగా ఉన్నారు. ఇక్కడ కొండ సురేఖ అనుచరవర్గం కూడా కడియం కావ్యకే పనిచేస్తుంది. వరంగల్ పశ్చిమ, తూర్పులోనూ కాంగ్రెస్ ఎంఎల్ఏలు ఉన్నారు. కొండా సురేఖ తూర్పుకు ప్రాతినిధ్యం వహిస్తుండగా పశ్చిమకు నాయిని రాజేందర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంక్ ఉంది. ఇక వర్ధన్నపేటలో మాజీ పోలీస్ అధికారి కెఆర్ నాగరాజు ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పార్లమెంట్ అభ్యర్థి ఆరూరి రమేష్‌పై గెలుపొందారు. స్టేషన్‌ఘనపూర్‌కు కడియం శ్రీహరి ప్రాతినిధ్యం వహిస్తుండగా పాలకుర్తికి యంగ్ డైనమిక్ లీడర్‌గా యశ్వినిరెడ్డి ఉన్నారు. ఇలా ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎంఎల్ఏలు ఉన్నారు. బిఆర్‌ఎస్ ఓటు బ్యాంక్ ఉన్నా పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థి సుదీర్‌బాబు కావడంతో ఎవరు ఆసక్తి చూపడం లేదనన్న చర్చ ఆ పార్టీలోనే ఉంది. బిజెపి నుండి పోటీ చేస్తున్న ఆరూరి రమేష్‌ను అసెంబ్లీ ఎన్నికల సందర్భంగారే వర్ధన్నపేటలో తిరస్కరించారు. బిజెపికి వరంగల్ పశ్చిమలో కొంత మేరకు బలం ఉన్నా అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆశించిన మేరకు ఓట్లు రాబట్టలేదు. ఈ పరిస్థితిలో బిజెపికి కష్టమనే సంకేతాలు వనిపిస్తున్నాయి. ఇక బిఆర్‌ఎస్ అభ్యర్థి విషయంలో ఆ పార్టీ శ్రేణుల్లోనే నిరాశ ఉన్నా ఓటర్లు మాత్రం ఆ ముగ్గురిలో ఎవరికి పట్టం కడతారన్నది చూడాలి.

## భూపాలపల్లిలో ఎవరికి వారికే గెలుపు ధీమా

### నియోజకవర్గంలో కాంగ్రెస్ వర్సెస్ బిజెపి

**ప్రజాపక్షం /జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ఎంపి ఎన్నికల నామినేషన్ల పర్వం కొనసాగుతున్న ఈ సమయంలో భూపాలపల్లి నియోజకవర్గంలో రాజకీయం హీటెక్కుతుంది.ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే భూపాలపల్లి నియోజకవర్గానికి ఒక్క ప్రత్యేకత స్థానం ఉంటుంది. ఇక్కడి ప్రజల తీర్పు విచిత్రంగా ఉంటుంది. సింగరేణి పారిశ్రామిక ప్రాతం అవడంతో వివిధ రంగాల ప్రజలు ఇక్కడ ఉద్యోగరీత్యా ఉంటారు. ఒకపక్క దంచికొడుతున్న ఎండలు మరొక పక్క ఎన్నికల ప్రచారాలతో భూపాలపల్లిలో ఎంపి ఎన్నికల రాజకీయ నాయకుల ప్రచారాలు ఊపందుకున్నాయి. నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖరారు చేశారు. కాంగ్రెస్ నుండి ఎంపి అభ్యర్థిగా కడియం శ్రీహరి తనయురాలు డాక్టర్ కడియం కావ్య, బిజెపి ఎంపి అభ్యర్థిగా వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్, బిఆర్‌ఎస్ పార్టీ నుండి డాక్టర్ సుధీర్ కుమార్‌లు పోటీలో నిలవనున్నారు. మొత్తంగా నియోజకవర్గంలో వివిధ పార్టీ నాయకులు నియోజకవర్గంలో ముఖ్య కార్యకర్తల సమావేశాలు ఇప్పటికే జరుగుతున్నాయి. ఇంతకు ముందే బిజెపి ఎంపి ఎన్నికల సన్నాహక సమావేశం బిజెపి కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపి అభ్యర్థి ఆరూరి రమేష్ వచ్చి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. అట్లాగే ఈ నెల 16 న కాంగ్రెస్ పార్టీ ఎంపి ఎన్నికల సన్నాహక సమావేశం ఎఎస్ఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపి అభ్యర్థి కడియం కావ్య కార్యకర్తల్లో ఉత్సాహన్ని నింపారు. అట్లాగే బిఆర్‌ఎస్ పార్టీ ఎంపి ఎన్నికల సన్నాహక సమావేశం నేడు జిల్లా కేంద్రంలోని బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి తెలిపారు.



నియోజకవర్గంలో ఇప్పటికే బిజెపి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. అన్ని మండల స్థాయిలో కార్యకర్తల సమావేశాలు పూర్తిచేసి ఎన్నికల రణరంగానికి సిద్ధంగా పావులు కదుపుతున్నారు నాయకులు. మొత్తంగా వరంగల్ ఎంపి సెగ్మెంట్ లో త్రిముఖ పోటీ ఉండనుంది. కాని భూపాలపల్లి నియోజకవర్గంలో కాగ్రెస్ వర్సెస్ బిజెపి మధ్యనే గట్టి పోటీ ఉంటుంది. విషయం ఏమిటంటే వీరంతా ఒకప్పుడు ఒకే పార్టీకి చెందిన వారు కావడం . నేడు ఎంపి ఎన్నికల్లో వీరు వివిధ పార్టీల నుండి పోటీలో వీరు ప్రత్యర్థులుగా తలపడటం విశేషంగా చెప్పవచ్చు. భూపాలపల్లి నియోజక వర్గంలో కాంగ్రెస్ మొదటి స్థానంలో 2వ స్థానంలో బిజెపి, మూడవ స్థానంలో బిఆర్‌ఎస్ పార్టీ ఉంటుందని చెప్పవచ్చు ఎందుకుంటే వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాలు కాంగ్రెస్ 6గురు ఎంఎల్ఏలు వుండటం ఒక్క జనగామ మాత్రమే బిఆర్‌ఎస్ ఖాతాలో ఉంది. ఇటీవలే కాలంలో బిఆర్‌ఎస్ పార్టీ నుండి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తన కూతురు ఎంపిటికెట్ ఇచ్చిన కాన్సల్ చేసుకొని కాంగ్రెస్‌లో చేరారు. అంటే ఆరు నియోజవర్గంలో ఉన్న ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కాతాలోనే ఉన్నాయి. అదే విధంగా కడియం శ్రీహరి లాంటి సీనియర్ నాయకుడు కూతురు కడియం కావ్య కావడం కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తుండటంతో తన అధికారంతో గెలిపించుకునే అవకాశం ఎక్కువగా ఉందని చెప్పవచ్చు. అదే విధంగా వర్ధన్నపేట ఎమ్మెల్యేగా పోటిచేసి ఇటివలే జరిగిన ఎన్నికల్లో ఓటమి చెంది బిజెపిలో చేరి ఆరూరి రమేష్ వరంగల్ ఎంపి టికెట్ తెచ్చుకున్నాడు. దానికితోడు ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఆర్థికంగా ఉన్న వ్యక్తిగా వరంగల్ పార్లమెంట్ స్థానంలో మాదిగ సామాజిక ఓటింగ్ ఎక్కువగా ఉండటం కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు. అదే విధంగా దేశంలో బిజెపి అధికారంలో ఉండటం మోదీ ముచ్చటగా మూడవ సారి హ్యాట్రిక్ కొట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో చాలెంజ్‌గా తీసుకోవంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలు కలిసి రావచ్చు. బిఆర్‌ఎస్ పార్టీ నుండి ఉద్యమ కారుడు, డాక్టర్ సుధీర్ కుమార్ ప్రస్తుత హన్మకొండ జెడ్పీ చైర్మన్ గా కొనసా గుతున్నా డు.

బిఆర్‌ఎస్ నుండి కడియం కావ్య తప్పు కోవడంతో స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యకు టికెట్ ఇస్తారని జోరుగా ప్రచారం సాగి చివరకు డాక్టర్ సుధీర్ కుమార్‌కు కెసిఆర్ టికెట్ ఇచ్చారు. అయితే డాక్టర్ రాజయ్యకు ఎంపి టికెట్ ఇస్తే కడియం కావ్యకు గట్టి పోటి ఇచ్చేవాడు రాజయ్య అని ప్రజల్లో కొంత చర్చ జరుగుతుంది. సుధీర్ కుమార్ పెద్దగా పాపులర్ అయిన వ్యక్తి కాకపోవడంతో ప్రజల్లో కొంత నిరుత్సంగా ఉన్నట్టుగా వినబడుతుంది.

మొత్తంగా నియోజకవర్గంలో ఎండలతో పాటు వివిధ రాజకీయ పార్టీల మీటింగ్‌లతో నియోజకవర్గం హీటెక్కిందని చెప్పవచ్చు.

మొత్తంగా వరంగల్ ఎంపి స్థానం దక్కించుకోవడం కోసం వివిధ పార్టీ నాయకులు గెలుపు కోసం ఎవరి ధీమా వారికే ఉంది.ఈ ఎంపి ఎన్నికల రణరంగంలో భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలు ఎవరిని అహక్కున చేర్చుకుంటారో వేచి చూడాలి.

## తగ్గేదెవరు... ఇచ్చేదెవరికి?

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థికి సంబంధించి పట్టుబడుతున్న వారిలో తగ్గేదెవరు, అధిష్టానం సీటు ఇచ్చేది ఎవరికి అన్న దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమై మూడు రోజులు గడిచినా అభ్యర్థి ఎంపిక జరగలేదు. మరో రెండు రోజుల వరకు తేలే అవకాశం లేదని సమాచారం. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం తమ అనుచరులు లేదా బంధుగణానికి ఇప్పించుకునేందుకు పోటీ పడుతున్నారు. తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ పోటీ పై కాస్త పట్టు సడలించినప్పటికీ మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కుటుంబ సభ్యుల కోసం గట్టి పట్టుబడుతున్నారు. ఓ దశలో మంత్రుల కుటుంబ సభ్యులు కాకుండా అభ్యర్థిని ఎంపిక చేయాలని అధి నాయకత్వం నిర్ణయించినా ఆ నిర్ణయాన్ని కూడా అమలు చేయలేని పరిస్థితి. ఇప్పుడు స్థానికత, సామాజిక వర్గం రెండు అంశాలు అభ్యర్థి ఎంపిక చుట్టూ తిరుగుతున్నాయని సమాచారం. సామాజిక మాధ్యమాలలో మాత్రం అభ్యర్థి ఎంపిక పూర్తయింది అంటూ ఆయా నాయకుల అనుకూల వర్గాలు ప్రచారం చేస్తుండడంతో గందర గోళం నెలకొంది. ప్రస్తుతం ఐదు పేర్లు మాత్రం అధిష్టాన వర్గం పరిశీలనలో ఉన్నాయని ఆ ఐదుగురి నుంచి ఒకరు ఎంపిక కావచ్చునని భావిస్తున్నారు. ఏ కాంగ్రెస్ నేతను అభ్యర్థి ఎంపిక విషయమై కదిపినా అధిష్టాన నిర్ణయం మా చేతిలో ఏమీ లేదంటూ సమాధానమిస్తున్నారు. మంత్రులు పట్టువిడుపులపై ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక ఉంటుందనేది వాస్తవం. రాష్ట్రంలోని 17 నియోజక వర్గాలలో ప్రధానమైన ఓ సామాజిక వర్గానికి ఒక్క స్థానం కూడా కేటాయించనందున ఆ సామాజిక వర్గానికే ఖమ్మం సీటు కేటాయిస్తారని కొందరు లేదు గతంలో ఇచ్చిన హామీ మేరకు అధిష్టానం అభ్యర్థిని ఎంపిక చేస్తుందని మరి కొందరు ప్రచారం చేస్తున్నారు. మధ్యే మార్గంగా వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి వియ్యంకుడు రామసహాయం రఘురామిరెడ్డి పేరు కూడా వినిపిస్తున్నది. నిజామాబాద్ జిల్లాకు చెందిన మండవ వెంకటేశ్వరరావు, ఖమ్మంజిల్లాకు చెందిన రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావులతో పాటు మంత్రుల కుటుంబ సభ్యులు మల్లు నందిని, పొంగులేటి ప్రసాదరెడ్డి, పారిశ్రామిక వేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ చివరి జాబితాలో ఉన్నట్లు చెబుతున్నారు. మంత్రుల కుటుంబ సభ్యులలో ఎవరికి ఇచ్చినా పార్టీలో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయన్న వాదనను అధిష్టానం ముందు కాంగ్రెస్ నేతలు ఉంచారు. తెర ముందు, తెర వెనక పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక వాయిదా పడుతూ వస్తుంది. కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికలో ఆలస్యంఆ పార్టీకి ఎంతో కొంత నష్టం చేస్తుందన్నది వాస్తవం.



ఇదే సమయంలో కాంగ్రెస్ క్యాడర్‌లోనే భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. లోకల్ అభ్యర్థి అయితే ఒక వేళ కాకపోతే అనే వాదనల మధ్య కాంగ్రెస్ ఓటు చెదిరిపోతుందన్న ప్రచారం జరుగుతుంది. దీనికి తోడు ఇప్పుడిప్పుడే వర్గ భావన క్యాడర్‌లోకి వెళ్తుంది. ఇది కూడా ఇబ్బందికర పరిస్థితికి దారి తీయవచ్చు. వీటికి తోడు రుణ మాఫీ తదితర అంశాలను రాజకీయ అంశాలుగా విపక్షాలు మారుస్తున్న వేళ కాంగ్రెస్‌కు గత ఊపు ఇప్పుడు కనిపించడం లేదు. అభ్యర్థి ఎంపిక, ప్రచారం తదనంతర ఫలితాలు ఎలా ఉంటాయో వేచి చూద్దాం.

## 14 ఎంపి సీట్లలో కాంగ్రెస్ గెలుపు

### పౌరసరఫరాలశాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/చింతలపాలెం:** రాష్ట్రంలో త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 14 ఎంపి సీట్లు గెలవడం ఖాయమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన నల్లగొండ పార్లమెంట్ ఎన్నికల సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్ పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నాడని, పార్లమెంట్ ఎన్నికల తరువాత బిఆర్‌ఎస్ అడ్రస్ లేకుండా పోతుందన్నారు. బిజెపిని నమ్మేవాళ్లు లేని ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటానని, మండలాన్ని మరింత అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానన్నారు. తాగునీటి సమస్య రాకుండా లిఫ్ట్ నడిపే బాధ్యత తీసుకుని ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతున్నానని అన్నారు. కాంగ్రెస్ అంటేనే రైతు పక్షపాతి అన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరాల కొండారెడ్డి,మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 21న హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే పార్లమెంట్ ఎన్నికల సమీక్షా సమావేశాన్ని నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని, నల్లగొండ ఎంపి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## తెలుసుకుందాం

### వజ్రం చీకట్లో మెరుస్తుందా?



నాణ్యతగల వజ్రం చీకట్లో మెరుస్తుందని చాలామంది అనుకుంటారు. అయితే అది ఎన్నో దశాబ్దాలుగా ప్రచారంలో ఉన్న ఒక అపోహ మాత్రమే. కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం భూగర్భంలో రాతి పొరల మధ్య చిక్కుకున్న బొగ్గు ముక్కలు అపారమైన వేడికి, ఒత్తిడికి గురై క్రమంగా వజ్రాలుగా మారుతాయి. నల్లగా, ముట్టుకుంటే చేతికి మసి అంటుకునే నాటి బొగ్గుముక్కలే నేడు వాడుకలో ఉండే వజ్రాలు. ఇవి చీకట్లో మెరుస్తాయన్నది నిజంకాదు. ఎందుకంటే వజ్రానికి దీపంలాగా స్వయంగా వెలుగునిచ్చే శక్తి లేదు. అయితే, స్వల్ప కాంతిలో కూడా వజ్రం తళతళ మెరుస్తుంటుంది. వాస్తవానికి వజ్రంలో బొగ్గు పరమాణువులు తప్ప మరేమీ ఉండవు. భూగర్భంలోని ఒత్తిడే ఈ పరమాణువులను ఒక ప్రత్యేక పద్ధతిలో అమరచడానికి కారణమవుతుంది. ఆ అమరిక స్ఫటిక మాదిరి ఏర్పడుతుంది. వజ్రాన్ని వెలికితీసినప్పుడు ఎలాంటి మెరుపు ఉండదు. వాటిని సానబెట్టిన తర్వాతే మెరుస్తాయి. గాజు, నీరు లాంటి పారదర్శకమైన వస్తువులన్నింటికీ కాంతి కిరణాలను నలుదిశగా వెదజల్లే శక్తి ఉంది. ఈ శక్తి అధికంగా ఉండే వస్తువు వజ్రం. కాబట్టి.. వజ్రంమీద పడిన కాంతి కిరణం బయటికి సులభంగా రాలేక మళ్లీ, మళ్లీ వెనుదిరిగి, వేర్వేరు ఉపరితలాలపైపడి పరావర్తనం చెందుతుంది. అలాంటప్పుడు అది వెలుగు విరజిమ్ముతున్నట్లుగా కనిపిస్తుంది. అంతేగానీ, వజ్రం స్వయం ప్రకాశకం కాదు. అంటే, తనంతట తానుగా వెలుగును చిమ్మే శక్తి వజ్రానికి లేదు.



### సుదూరాల్లో బిగ్ రింగ్



ఖగోళ శాస్త్రంలో 'బిగ్ రింగ్' అనే పదం ఇటీవ కాలంలో బాగా వినిపిస్తున్నది. మనకు ఎంతో.. ఎంతో... ఎంతో దూరంలో ఉన్న గెలాక్సీలు, గెలాక్సీ సమూహాలతో కూడిన వలయమే 'బిగ్ రింగ్'. ఇది మనకు 9.2 బిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. దీని వ్యాసం 1.3 బిలియన్ కాంతి సంవత్సరాలు. రింగ్ ఆకారంలో ఉన్న అతి పెద్ద నిర్మాణంగా దీనిని పేర్కోవాలి. ఇది బూట్స్ రాశి దగ్గర కనిపిస్తుంది. దీనిని ఇటీవలే సెంట్రల్ లాంక్‌షైర్ విశ్వవిద్యాలయంలో పిహెచ్‌డి చేస్తున్న విద్యార్థి అలెక్సియా లోపెజ్ కనుగొన్నది. 2021లో, ఆమె అదే ప్రాంతంలో ఉన్న జెయింట్ ఆర్క్ అనే మరో గెలాక్సీ వలయాన్ని కూడా ఆమె గుర్తించింది. అయితే, గెలాక్సీ నిర్మాణాల వ్యాసాన్ని లెక్కించడానికి ఆమె వద్ద సైద్ధాంతిక విధానం అంటూ ఏదీ లేదు. కాబట్టి, ఈ 'బిగ్ రింగ్', జెయింట్ ఆర్క్ గెలాక్సీల వ్యాసం లేదా చుట్టుకొలతను అధికారికంగా ఇంకా ఎవరూ ధ్రువీకరించలేదు.

### అద్దాలకూ.. కాంతికీ సంబంధం ఏమిటి?



ప్రతి ఇంట్లోనూ అద్దం ఉంటుంది. అందుకే, ప్రతిబింబం చూసుకునే ఈ దర్పణం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే, అద్దాలకూ, కాంతికి సమంధం ఉందనే విషయం తక్కువ మందికే తెలుసు. అడ్డు అనేది ఏమీ లేనంత సేపు కాంతి రుజు మార్గంలో ప్రయాణిస్తుంది. ఏదైనా వస్తువు అడ్డుగా ఉంటే, అది వెంటనే ఆ వస్తువు నుంచి వెక్కు మలుతుంది. దీనినే పరావర్తనం అంటారు. ఈ పరావర్తనంలో 'నియ త', 'అనియత' అనే రెండు రకాలున్నాయి. నునుపైన లేదా మెరిసే ఉపరితలం నుంచి పరావర్తం చెందడాన్ని నియత పరావర్తనం అంటారు. అదే విధంగా గరుకైన ఉపరితలం నుంచి వెనక్కు మళ్లడాన్ని అనియత పరావర్తనంగా పేర్కొంటారు. ఈ సూత్రం ఆధారంగానే కుంభాకార, పుటాకార దర్పణాలను తయారు చేస్తారు. పుటాకార దర్పణం అంటే మనం ఇళ్లలో వాడుకునే అద్దాలు. కుంభాకార దర్పణాలకు కార్లు, మోటారు వాహనాలు నడిపే వారు వెనుక నుంచి వచ్చే వాహనాలను చూడడానికి ఉపయోగించే అద్దాలు. ఇదీ అద్దాలకూ, కాంతికీ ఉన్న సంబంధం.

### విశ్వం కూలిపోతుందా?



పరిభ్రమించే ఏ వస్తువైనా క్రమంగా వేగాన్ని కోల్పోయి, ఎప్పుడో ఒకప్పుడు నిశ్చల స్థితికి చేరుతుంది. అయితే, కొన్ని మిలియన్ సంవత్సరాలుగా ఉన్న విశ్వానికీ ఇలాంటి ప్రమాదం ఉంటుందా? అంటే అవుననే అంటున్నారు కొలంబియాలోని యూనివర్సిడాడ్ శాస్త్రవేత్తలు. డార్క్ ఎనర్జీ స్పెక్ట్రోస్కోపిక్ ఇన్‌స్ట్రుమెంట్ (డిఇఎస్ఐ) ద్వారా సేకరించిన డేటాను ఉపయోగించి ఈ నిర్ణయానికి వచ్చినట్టు వీరు తమ తాజా నివేదికలో పేర్కొన్నారు. డార్క్ ఎనర్జీ ప్రభావం తగ్గుతున్నట్టు వీరు గుర్తించారు. దీనిని 'బిగ్ క్రంచ్'గా అభివర్ణించారు. ఈ పరిశోధన సారాంశం ఏమిటంటే, డార్క్ ఎనర్జీ ప్రభావం క్షీణిస్తున్న కారణంగా, విశ్వం నెమ్మదిగా ఆగిపోతుంది. ఇందుకు వీరు మరో కారణాన్ని కూడా జత చేశారు. విశ్వం నిరంతరం విస్తరిస్తునే ఉందనే సిద్ధాంతాన్ని అన్వయించారు. విస్తరణ లేదా వ్యాప్తి వల్ల మేటర్ అనేది పలుచబడుతుంది. తత్ఫలితంగా విశ్వ చలన వేగం తగ్గుతుంది. చివరికి 'బిగ్ క్రంచ్'కి దారి తీస్తుంది. అయితే, ఇది జరగడానికి కొన్ని మిలియన్ సంవత్సరాలు పడుతుంది. కాబట్టి, ఇప్పట్లో విశ్వానికిగానీ, మన సౌర మండలానికిగానీ వచ్చిన ముప్పు ఏమీ లేదు. కాకపోతే, పర్యావరణ మార్పుల నుంచి భూగోళాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మాత్రం మనుషులదే. ఇదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే, మరికొన్ని వందల సంవత్సరాల్లోనే భూమి అగ్నిగోళంగా మారిపోతుంది.

### ధ్వంసమైంది.. తిరిగి ఠీవిగా నిల్చొంది



అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ గురించి విశేషాలు ఎన్నో ఉన్నాయి. పర్యాటనలను విశేషంగా ఆకర్షించే ఈ భవనం ఒక సారి ధ్వంసమైనప్పటికీ, తిరిగి ఠీవిగా నిలబడింది. మరింత సుందరంగా ముస్తాబయింది. అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసి నగరంలోని ఈ భవనానికి ఐర్లాండ్ ఆర్కిటెక్ట్ జేమ్స్ హూబర్ రూపకల్పన చేశారు. 1792, అక్టోబర్ 13న ఈ భవన నిర్మాణం మొదలైంది. దీనిని గచ్చకాయ రంగు రాళ్లతో దీనిని నిర్మించారు. 1800 సంవత్సరం నాటికి నిర్మాణం పూర్తికాగా, అమెరికా అధ్యక్షుడి అధికార నివాసంగా మారింది. అయితే, 1814 యుద్ధంలో, ఆగస్టు 24న బ్రిటిష్ సైన్యం ఈ భవంతిని ధ్వంసం చేసి, అంతటితో ఆగకుండా తగలబెట్టింది. పాత భవనంలో కొద్ది భాగం మాత్రమే మిగలడంతో, మరమ్మతులతోపాటు నూతన నిర్మాణం కూడా అవసరమైంది. తిరిగి హూబర్ పర్యవేక్షణలోనే కొత్త భవనం 1817లో పూర్తయింది. దగ్ధమైనప్పుడు గోడలకు పట్టిన పొగ మరకలు కనబడకుండా తెల్లరంగు వేశారు. అప్పటి నుంచి ఈ భవనానికి 'వైట్ హౌస్' అన్న పేరు వాడుకలోకి వచ్చింది. 1902లో, అప్పటి దేశాధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ ఇదే పేరును అధికారికంగా ప్రకటించారు. వాడుకలో ఉన్న 'వైట్ హౌస్' అనే పేరుకు అధికారిక ముద్ర పడింది.

### గబ్బిలాల గొప్ప చరిత్ర!



గబ్బిలం...పక్షిలా ఎగరగల ఏకైక క్షీరదం. 'ఎగిరే ఉడతలు' పేరు వినే ఉంటారు. అవి కూడా క్షీరదాలే. అయితే, నిజానికి అవి ఎగరలేవు. కేవలం గెంతుతాయి. గ్లైడింగ్‌ను ఫ్లయింగ్‌తో పోల్చకూడదు. ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకున్న గబ్బిలం తల్లకిందులుగా వేలాడుతుంది. ప్రతి గబ్బిలం రోజుగు సగటున 1,200 దోమలు లేదా కీటకాలను తింటుంది. మానవ జాతికి ఇంతకంటే గొప్పమేలు ఇంకేముంటుంది? కొన్ని గబ్బిలం రక్తం తాగుతాయి. వాటిని 'వాంపైర్ బ్యాట్స్'గా పిలుస్తారు. ఇవి జంతువులకు తెలియకుండా, వాటికి నొప్పి కలగకుండా గాయం చేసి, రక్తాన్ని తాగుతాయి. అయితే కేవలం ఒక స్పూన్ పరిమాణం కంటే ఎక్కువ రక్తాన్ని పీల్చవు. గబ్బిలాలు రెట్టలను ఎరువుగా వాడతారు. ఇది అత్యంత బలవర్ధకమైన ఎరువు. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఈ వ్యాపారంలో అగ్రస్థానాన్ని ఆక్రమించింది. మన దేశంలో మాదిరిగానే చాలా దేశాల్లో గబ్బిలాలను చెడుకు సంకేతంగా భావిస్తారు. కానీ, చైనా, థాయిలాండ్ వంటి దేశాల్లో గబ్బిలం శుభసూచకం. ఇక గబ్బిలాల శబ్దం, రంగు, శరీరం నుంచి వచ్చే వాసన ఒకటిగా ఉండవు. మనిషి వేలి ముద్రల మాదిరిగానే, ఈ లక్షణాలు కూడా వేరువేరుగా ఉంటాయి. అందుకే, వదలు, వేలుగా.. గుంపులుగా తిరుగుతున్నప్పుడు కూడా పిల్లలను తల్లి గబ్బిలం గుర్తుపట్టగలుగుతుంది. 'ఫ్లయింగ్ ఫాక్స్' జాతి గబ్బిలాల్లో అతి పెద్దవి. రెక్కలు విప్పితే ఇవి ఆరడగుల వెడల్పు ఉంటాయి. ఇండోనేషియాలో ఎక్కువగా కన్పిస్తాయి. ఇక అత్యంత చిన్న సైజులో ఉండే 'బంబిల్బీ బ్యాట్స్' థాయిలాండ్‌లో ఎక్కువగా కనిపిస్తాయి. వాటి పరిమాణం సుమారుగా కాలి బొటనవేలంత ఉంటుంది. కాగా, ప్రపంచంలోని క్షీరదాల్లో మూడోవంతు గబ్బిలాలే. సాధారణంగా గబ్బిలాలకు అత్యధిక వేడిగానీ, చలిగానీ ఇష్టం ఉండవు. కానీ, అవసరమైతే ఎడారుల్లో లేదా మంచు ప్రాంతాల్లోనూ చాలాకాలం బతుకుతుంది. విలక్షణమైన గబ్బిలాలను చులకనగా చూడడం ఎంత వరకు సమంజసం?

సేకరణః బిఎస్ఎస్ మైత్రేయి

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతకు మన ఓటర్లకేమి సంబంధం?

ఇది ఎన్నికల వేళ కదా! ప్రపంచంలో ఎక్కడ ఏమి జరిగినా, జరుగుతున్నా దాన్ని భారతదేశానికి తీసుకువచ్చి ఓట్లతో సంధానించి లబ్ధిపొందగోరే నేర్పరి మన ప్రధాని నరేంద్ర మోదీ. అందుకే కదా మొన్నటిదాకా 'విశ్వగురు' అని కీర్తించింది ఆయన గణం. ఇప్పుడది 'విశ్వ బంధు'గా మారింది. మధ్య ప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ రీజియన్‌లో శుక్రవారం బిజెపి ఎన్నికల ప్రచార సభలో ప్రసంగిస్తూ ఆయన ప్రదర్శించిన చాకచక్యం ఆయనకే చెల్లు : "ప్రపంచంపై యుద్ధ మేఘాలు సంచారం చేస్తున్నాయి. ప్రపంచంలో యుద్ధం లాంటి పరిస్థితి ఉన్నప్పుడు భారత దేశానికి యుద్ధ ప్రాతిపదికపై పనిచేసే బలమైన ప్రభుత్వం అవసరం. ఏ పరిస్థితిలోనైనా దేశాన్ని రక్షించుకోగలిగిన ప్రభుత్వం అవసరం. పూర్తి మెజారిటీ కలిగిన బిజెపి ప్రభుత్వం మాత్రమే ఈ పనిచేయగలదు" అన్నారు. రష్యా–ఉక్రేన్ యుద్ధం రెండవ సంవత్సరంలో ప్రవేశించింది. ఆఫ్రికాలో మరో ఒకట్రెండు స్థానిక యుద్ధాలు జరుగుతున్నాయి. వాటితో మనకెట్టి ప్రమేయం లేదు, పర్యవసానాల ప్రభావం లేదు. ఎటొచ్చి మన దేశానికి ఆదినుంచి ప్రత్యక్ష సంబంధం గలది పశ్చిమాసియా సమస్య. అందులో పాలస్తీనా – ఇజ్రాయిల్ సమస్య ప్రధానమైంది. పాలక ప్రభుత్వాలను మార్చే అమెరికా దుష్ట విధానంవల్ల గత దశాబ్దంలో ఇరాక్, సిరియా, లిబియా వంటి సమస్యలు ముంచుకొచ్చాయి. పాలస్తీనియన్‌ల మాతృదేశ సమస్య ప్రాతిపదికగా అరబ్ ప్రపంచంతో ఇజ్రాయిల్ యుద్ధాలు అమెరికా అండదండలతో దాదాపు మూడు జరిగాయి. నాటి భారత ప్రభుత్వాలు అలీనోద్యమ నేతగా ఐరాస ద్వారా శాంతిస్థాపనకు కృషి చేశాయి, పాలస్తీనియన్‌లకు మాతృదేశ స్థాపనను డిమాండ్ చేశాయి. తర్వాత తర్వాత పాలస్తీనా– ఇజ్రాయిల్‌లకు వేర్వేరు దేశాలను భౌగోళికంగా ఏర్పాటు చేయటం, రెండు దేశాలను పరస్పరం, ఐరాస గుర్తించే ప్రతిపాదనలను బలపరిచింది. ఎటొచ్చి గత రెండు – మూడు దశాబ్దాల్లోనే ఇజ్రాయిల్ వైపు మొగ్గుదల, ఆర్థిక, మిలటరీ రంగాల్లో సహకారం అనే మితవాద వైఖరి భారత ప్రభుత్వాలు తీసుకున్నాయి. మోదీ ప్రభుత్వం ఆ సంబంధాలను మరింత గాఢతరం చేసింది. ఈ దీర్ఘకాల క్రమంలో భారత్ ఏనాడూ పశ్చిమాసియా యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొనలేదు. ఇప్పుడు ఇజ్రాయిల్, పాలస్తీనా తీవ్రవాద గ్రూపుల మధ్య ఆరుమాసాలకు పైబడి సాగుతున్న కాల్పుల్లోనూ అదే వైఖరి. ఇజ్రాయిల్‌పై ఇరాన్ డ్రోన్‌లు, క్షిపణుల దాడి అనంతరం టెల్ అవీవ్ ప్రతిదాడులకు ఒడిగట్టటం, రెండు దేశాలు అణ్వాయుధాలు కలిగి ఉన్నాయన్న అంచనాల కారణంగా ఇది యుద్ధంగా మారితే రాగల ప్రమాదం పట్ల ప్రపంచదేశాలు ఆందోళన చెందుతున్నాయి. అంతేగాని మోదీలాగా యుద్ధ పరిస్థితులు ఎదుర్కొనేందుకు తమ ప్రభుత్వాలను పటిష్టవంతం చేసుకోవటం లేదు, ఎన్నికలు జరిగే దేశాల్లో బలమైన ప్రభుత్వాన్ని కోరటం లేదు.

భారతదేశం పాకిస్థాన్‌తో రెండు యుద్ధాల్లో విజయం సాధించింది. బాంగ్లాదేశ్ విముక్తి యుద్ధాన్ని విజయవంతం చేసింది. నాడు భారత ప్రభుత్వం, భారత సైన్యంలో నాయకత్వలోపం కనిపించలేదు.

దేశ భద్రత, రక్షణ విషయంలో గత కాంగ్రెస్ ప్రభుత్వాలను నిష్కారణంగా నిందించటం, టెర్రరిజంపై పోరాటంలో చిన్నచిన్న చొరవలను సైతం తమ నాయకత్వ ఘన కార్యాలుగా ఆపాదించుకుంటూ ప్రచారం చేసుకోవటం మోదీ ప్రభుత్వానికి, బిజెపికి అలవాటు. తాజా క్లెయిం అటువంటిదే. బిజెపికే 370సీట్లలో విజయం అని ఢంకా బజాయిస్తున్న మోదీజీ, "పూర్తి మెజారిటీ కలిగిన బిజెపి ప్రభుత్వ" అవసరాన్ని నొక్కిచెప్పటంలో ఆంతర్యమేమిటో ఊహించుకోవలసిందే!

ప్రజాపక్షం
21-04-2024, ఆదివారం

## రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి నిజంగా ముప్పు ఉందా?

రాజధాని సందడి
– బొమ్మగాని కిరణ్‌కుమార్

బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రభుత్వ స్థిరత్వంపై చర్చకు దారి తీసాయి. సుమారు 20 నుండి 30 మంది ఎంఎల్‌ఏలు తనతో టచ్‌లో ఉన్నారని బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థులకు బిఫామ్‌లు అందజేసిన సమావేశంలో కెసిఆర్ చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు మీడియాలో ప్రముఖంగా వచ్చాయి. గతంలో ఎంఐఎం మద్దతుతో కలిపి 111 మంది ఎంఎల్‌ఏలు ఉన్నా గత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బిజెపి ప్రయత్నాలు చేసిందని, ఇప్పుడు 64 మంది ఎంఎల్‌ఏలు ఉన్న కాంగ్రెస్ పార్టీని బిజెపి బతకనిస్తుందా? అని కూడా ఆయన అన్నారు. దీనికి టిపిసిసి ఛీఫ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరుసటి రోజు మహబూబ్‌నగర్‌లో జరిగిన సభలో ధీటుగా సమాధానమిస్తూ, మా ఎంఎల్‌ఏలను టచ్ చేస్తే మాడిమసైపోతారని, ప్రతి రోజు సాయంత్రం మీ ఎంఎల్‌ఏల సంఖ్యను లెక్కించుకోవాలని సవాలు విసిరారు. అంతే కాకుండా బిఆర్ఎస్ ఎంఎల్‌ఏ ప్రకాశ్ గౌడ్ అదే రోజు రేవంత్ రెడ్డిని కలిసి ఒకటి రెండు రోజుల్లో కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన శైశవ దశ నుండే ఈ ప్రభుత్వం కూలిపోతుందని అటు బిఆర్ఎస్, ఇటు బిజెపి నాయకులు శాపనార్థాలు పెడుతూ వస్తున్నారు. కొందరు బిఆర్ఎస్ నేతలైతే త్వరలోనే మరోసారి సిఎంగా కెసిఆర్ పగ్గాలు చేపడతారని అత్యుత్సాహంతో వ్యాఖ్యలు కూడా చేశారు. ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేకపోవడమో లేదా క్యాడర్‌ను నైరాశ్యం నుండి బైట పడేసేందుకో ఇలాంటి వ్యాఖ్యలు మొదట్లో చేశారనుకుంటే అర్థముంది. కాని నాలుగు నెలలు కావొస్తున్నా, కాంగ్రెస్ నేతల్లో ఎలాంటి పొరపొచ్చలు వచ్చిన దాఖలాలు లేకున్నా పార్లమెంటు ఎన్నికల తరువాత రాష్ట్రంలో రాజకీయ అస్థిరత ఏర్పడుతుందని ప్రతిపక్షాలు ఎందుకు ప్రచారం చేస్తున్నాయో లోతుగా ఆలోచించాల్సిన అంశం. వాస్తవానికి ఎన్నికల్లో ఓటమి, కాళేశ్వరం పిల్లర్‌ల కుంగుబాటు, ఐదుగురు సిట్టింగ్ ఎంపిలు ఇతర పార్టీలోకి వెళ్ళడం, ఎంపి టిక్కెట్లు ఇచ్చిన అభ్యర్థులు సైతం పార్టీని వీడడం, కవిత అరెస్టు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాల నేపథ్యంలో బిఆర్ఎస్ నాయకులు ఆత్మరక్షణలో పడ్డారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ సైతం ప్రతిపక్షాల నుండి వస్తున్న హెచ్చరికల నేపథ్యంలో పార్టీలో చేరికకు ప్రతిపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులకు గేట్లు తెరవడంతో గులాబీ పార్టీ మరింత కష్టాల్లో కూరుకుపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే 20 మందికిపైగా మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, ఆరుగురు జెడ్‌పి చైర్‌పర్సన్‌లు, ఎంపిటిసి సభ్యులు, పెద్ద సంఖ్యలో సర్పంచ్‌లతో పాటు ముగుర్గు ఎంఎల్‌ఏలు, ముగ్గురు సిట్టింగ్ ఎంపిలు, రాజ్యసభ పక్ష నాయకుడు, ఎంఎల్‌సిలు బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీనికి తోడు 25 మంది బిఆర్ఎస్ ఎంఎల్‌ఏలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో కూడా పార్టీలో ఏమి జరుగుతుంది? ఎవరు వీడిపోతున్నారు? తమ భవితవ్యం ఏమిటనే? ప్రశ్నలు వెంటాడుతున్నాయి. దీంతో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి కూడా వీరు అంతగా కాలు బైటికి పెడుతున్న దాఖలాలు కనపడడం లేదు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొనే కెసిఆర్ తనతో 20 – 30 మంది కాంగ్రెస్ ఎంఎల్‌ఏలు టచ్‌లో ఉన్నారనే వ్యాఖ్యలు చేశారని పరిశీలకులు భావిస్తున్నారు. గతంలో ఉద్యమ సమయంలో, అధికారంలో ఉన్న సమయంలో కెసిఆర్ చేసిన ఇలాంటి వ్యాఖ్యలు అప్పుడు క్లిక్ అయినంతగా ఈసారి కాలేదు. కాంగ్రెస్ ఎంఎల్‌ఏలు తమ పార్టీలోకి వస్తారంటే స్వంత క్యాడరే నమ్మే పరిస్థితి లేదు.

**ప్రమాదం పొంచి ఉన్నదా?**

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి దేశవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ప్రభుత్వాలను కూల్చివేస్తున్న వైనం అందరికీ తెలిసిందే.

మహారాష్ట్ర, బిహార్, గతంలో కర్నాటక, గోవా, మణిపూర్, అరుణాచల్ ప్రదేశ్, రాజస్తాన్, మధ్య ప్రదేశ్ తదితర రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బిజెపి యేతర ప్రభుత్వాలను అనైతికంగా కూల్చేసి బిజెపి ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకున్నారు. ఢిల్లీ, జార్ఖండ్‌లో ప్రభుత్వాలను కూల్చేందుకు బిజెపి అనేకమార్లు విఫలయత్నం చేసింది. అలాగే కొద్దినెలల ముందే హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రభుత్వాన్ని కూడా కూల్చేసేందుకు రాజ్యసభ ఎన్నికలు కేంద్రంగా ప్రయత్నాలు జరిగాయి. దీంతో తెలంగాణ శాసనసభలో సాధారణ మెజారిటీ 60 కంటే స్వల్పంగా ఎక్కువగా సిపిఐ ఒక్క ఎంఎల్‌ఏతో కలిపి 65 ఎంఎల్‌ఏ లు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేస్తారనే భావనను ప్రతిపక్షాలు కల్పిస్తున్నాయి. బిజెపి గత చరిత్రను బట్టి ఇది నిజమేమోనని ప్రజలు కూడా కొంత నమ్మసాగారు.

వాస్తవాలను పరికించి చూస్తే ఆ పరిస్థితి లేదు. కాంగ్రెస్ తరువాత అత్యధికంగా బిఆర్ఎస్‌కు 39 సీట్లు రాగా, అందులో ఒకరు మరణించడంతో ఆ సంఖ్య 38కి పడిపోయింది. మరో ముగ్గురు గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడంతో అధికార పార్టీకి మద్దతుగా ఉండే ఎంఎల్‌ఏల సంఖ్య 69కి పెరగగా, ప్రతిపక్ష బిఆర్ఎస్ సంఖ్యాబలం 35కు పడిపోయిం ది. ఎనిమిది స్థానాలు కలిగిన బిజెపి ప్రభుత్వాన్ని కూలుస్తుం దా? అంటే దాదాపు అసంభవమేనని పరిశీలకులు భావిస్తున్నారు.

బిజెపి రెండవ స్థానంలో ఉన్న రాష్ట్రాలలో మాత్రమే అధికారంలో ఉన్న పార్టీని తప్పించి, ఆ పార్టీ అధికారంలోకి రాగలిగింది.ఇక్కడ బిజెపి ఆ స్థితిలో లేదు. బిఆర్ఎస్‌కు ఆ అవకాశం లేదు. కాబట్టి పార్లమెంటు ఎన్నికల తరువాత కూడా కాంగ్రెస్ ప్రభుత్వ మనుగడకు ప్రమాదం ఏర్పడే అవకాశాలు లేవనే చెప్పుకోవచ్చు. ప్రభుత్వ స్థిరత్వంపై ప్రతిపక్షాల సవాళ్ళు, ఆరోపణలను కేవలం పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అయోమయాన్ని సృష్టించే పొలిటికల్ మైండ్‌గేమ్‌గానే భావించవచ్చు.

## స్త్రీలను మనుషులుగా చూడని మతాలు



డాక్టర్ దేవరాజు మహారాజు

స్త్రీలను బానిసలుగా చేసి, ప్రాతివత్యానికి కుదించి, వంటింటి కుందేళ్ళుగా మార్చినవి మత భావనలే. స్త్రీలను బురఖాల్లోకి నెట్టిన మతాలెన్నడూ వారిని మనుషులుగా చూడ లేదు. అభ్యున్నతి సాధించామనుకుంటున్న ఈ 21వ శతాబ్దంలోకి వచ్చిన తర్వాత కూడా స్త్రీల పరిస్థితి బాగుపడలేదు. ఒకప్పుడు వారికి ఓటు హక్కు లేదు. ఉద్యోగాలు చేసినా పురుషులతో సమానంగా జీతాలు లేవు. కూలిపనిలో సైతం, మగవారికి దొరికినంత కూలీ దొరకలేదు. ఇలాంటి ఎన్నో సామాజిక అవకతవకలకు మూలకారణం మత భావనలే. అవగాహనా రాహిత్యమే. మహిళా వ్యోమగాములు అంతరిక్షం చుట్టి వస్తారు గానీ, కొన్ని దేవాలయాల్లోకి ప్రవేశించలేరు. మన భారతీయ మహిళా శాస్త్రవేత్తను రాయల్ సొసైటీ గుర్తిస్తుంది కానీ, ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ ముట్టు గుడిసెలుంటాయి. అర్థ నారీశ్వరుణ్ణి సృష్టించుకుని, వ్యర్థ పూజలు చేస్తారు గానీ, కుటుంబ వ్యవస్థ బలంగా కొనసాగడానికి పూర్తి సమయం వెచ్చిస్తున్న మహిళల్ని మాత్రం తక్కువగానే చూస్తారు. దైవ భావనలో మునిగిన మతాలన్నీ కలిసికట్టుగా స్త్రీలను అనేకరకాల అణచివేతలకు గురిచేస్తూ వచ్చాయి. పురుషులు బయట తమ జీవితాల్ని శాసించే పెత్తందార్ల అణచివేతకు గురయితే, మహిళలు బయట పెత్తందార్ల అణచివేతకు, ఇంట్లో పురుషుల అణచివేతకూ గురికావల్సి వచ్చింది. ఆధిపత్య వర్గాల మీద పెరిగిన కసీ, కోపం ఎక్కడా వెళ్ళగక్కలేక, అదంతా తెచ్చి పురుషులు ఇంట్లో స్త్రీల మీద తీర్చుకోవడం జరిగేది. అగ్రవర్ణాలు స్త్రీలకు రూపొందించిన కట్టుబాట్లు ఇతర ఆధిపత్య వర్గాలవారు, అణగారిన వర్గాలవారు కూడా పాటించడం జరుగుతూ వచ్చింది. అగ్రవర్ణాల వారు గొప్పవాళ్ళయినట్టూ, వారి అడుగుజాడల్లో తాము నడవాల్సి ఉంటుందన్నట్టూ మిగతావారంతా భావించుకునేవారు. అలా అనుకరణ సాగుతూ వచ్చింది. ఇదే పరాయీకరణ. గొప్పవారిలాగ తాము బతకాలనుకోవడమే పరాయీకరణ.

అణగారిన వర్గాలు విద్యకు, వివేకానికీ దూరం చేయబడి, గుడ్డిగా అగ్రవర్ణాల్ని అనుకరిస్తూ వచ్చారు. వారు పూజించే దేవుళ్ళనే తమ దేవుళ్ళనుకున్నారు. వారి ఆచారాలు, చాదస్తాలు కూడా తమవే అనుకున్నారు. అలా అనుకునే విధంగా ప్రభావితం చేయబడ్డారు. స్త్రీల గురించి వారు రూపొందించిన నియమ నిబంధనల్ని వీరు కూడా జీవితంలో పాటిస్తూ వస్తున్నారు. ఇది సమకాలీనంలో కూడా చూస్తున్నాం. మనుధర్మ శాస్త్ర ప్రకారం బ్రాహ్మణుల కున్న స్థాయి కింది కులాల వారికి, అంటే బ్రాహ్మణేతరులకు లేదు. మరి ఈ కింది కులాల వారు పట్టుబట్టలు కట్టి, దేవతార్చనలు చేసి, యాగాలు నిర్వహించి, మఠాధి పతుల కాళ్ళమీద పడీ ఎందుకీ నానాయాతన ? కేవలం పరాయీకరణ! తాము కానిదేదో అయిపోవాలని తాపత్రయం. మత పెద్దలతో మంచి వాళ్ళనిపించుకోవాలనే దుగ్ధ. ఆత్మద్రోహం చేసుకుని, అవన్నీ చేయడం వల్ల వీరేమైనా ఉన్నతమైన సామాజిక వర్గానికి మారిపోతారా? లేదు కదా ?

ఇది ఇలా ఉండనిస్తే, మనుధర్మ శాస్త్రంలోనూ, ఇతర పురాణాల్లోనూ స్త్రీల గురించి, వారి వ్యక్తిత్వ గురించి ఏం చెప్పారో చూద్దాం! మరి వాటిని అగ్రవర్ణం కానివారు, ఇతర సామాజిక వర్గాల వారు ఎందుకు ఆచరిస్తున్నారూ? ఆలోచించుకోవాలి. విజ్ఞతతో విశ్లేషించుకోవాలి. ఎవరో అగ్రవర్ణం వారు చెప్పారు కదా అని గంగిరెద్దులా తలూపుతూ పాటించడమేనా? శ్రమ తెలియని, శ్రమ విలువ తెలియని మూర్ఖ పండితుల బోధనల్ని ఖాతరు చేయడం ఎందుకూ? స్త్రీల గురించి ఏ ఏ శాస్త్రాల్లో ఏముందో ఒకసారి గమనించండి. దాదాపు ఇవే భావాలు ఇతర మత గ్రంథాల్లోనూ ఉన్నాయి. వెతికి తీసి, విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది. **యజ్ఞవల్క స్మృతి 1:87 లో** విషయాలు ఇలా ఉన్నాయి. భర్త ఆజ్ఞ లేకుండా స్త్రీ బయటకుపోరాదు. చప్పుడు అయ్యేట్లు నడువరాదు. అపరిచితులైన పురుషులతో మాట్లాడరాదు. చీర మడమల వరకు కట్టు కోవాలి. నాభి భాగం కనపడనీయ రాదు. రొమ్ము భాగం వ్యక్తం కానీయరాదు. నోటిని కప్పుకోవాలి తప్ప, నోరు తెరిచి బిగ్గరగా నవ్వరాదు. ఇక **కూర్మపురాణంలో** మరొక మూర్ఖపు ఆలోచన రాసి ఉంది. స్త్రీలు చేసే మానసిక వ్యభిచార ఫలితంగానే వారికి నెల నెలా ముట్టురూపంలో మైల రావడం జరుగుతూ ఉంది. **మనుధర్మ శాస్త్రంలో** స్త్రీలను కించపరిచే అంశాలు చాలా ఉన్నాయి. ఏ బ్రాహ్మణుడైతే శూద్ర స్త్రీని తన పానుపు నెక్కించుకుంటాడో అతను అధోగతి పాలవుతాడు. ఆమెతో సంతానాన్ని పొందితే బ్రాహ్మణ్యాన్నే కోల్పోతాడు (3–17) ఏ కన్యకైతే తండ్రెవరో తెలియదో, తోడబుట్టిన వాడు కూడా ఉండడో అలాంటి కన్యను వివాహామాడకూడదు. స్త్రీలు మనసుని



అదుపులో పెట్టుకోలేరని **రుగ్వేదం**(3:33:17) చెపితే, స్త్రీల లోపాల్ని, దుర్గుణాల్ని చెప్పాలంటే నూరు నాలుకలకు నూరేళ్ళ కాలమైనా చాలదు – అని **మహాభారతం** (8:74–78) చెప్పింది.

గొప్పగా చెప్పుకునే మనుస్మృతిలో స్త్రీని గురించిన అభిప్రాయాలు సంక్షిప్తంగా చెప్పుకోవాలంటే ఇలా ఉన్నాయి. పురుషుల్ని చెరచడం స్త్రీల స్వభావం. వారు అజ్ఞానుల్నే కాదు, విజ్ఞుల్ని కూడా భ్రష్టు పట్టిస్తారు. వయసులో ఉన్నాడా, చక్కని వాడా? అనేవి కూడా చూడరు. మగవాడైతే చాలు! పురుషుణ్ణి చూడగానే అతని పొందుకోరుకుంటారు. వ్యభిచార శీలత వారి సహజలక్షణమని వేదాలు చెప్పాయి. ఈ వ్యభిచార కాంక్షవల్లనే స్త్రీకి భర్తమీద అనురాగం ఉండదు. తల్లి, చెల్లి, కూతురితో నైనాసరే, పురుషుడు ఒంటరిగా కూర్చోకూడదు. వ్యభిచారం చేసిన స్త్రీ తరువాతి జన్మలో నక్కగా పుడుతుంది. భర్త చనిపోతే ఆమెమళ్లీ పెళ్ళిచేసుకోకూడదు. కానీ, భార్య చనిపోతే అంత్యక్రియల అనంతరం పురుషుడు మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చు. స్త్రీలు చపలచిత్తులు కాబట్టి వారు సాక్ష్యానికి పనికి రా రు.

కొంచెం ఇటూ అటుగా ఇవే భావాలు అన్ని మతాలు ప్రచారం చేశాయి. స్త్రీని బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా అణిచిపెట్టాయి. పురుషుల్లాగే వారుకూడా మనుషులేనన్నది గుర్తించలేదు. స్త్రీలను అణిచిపెట్టడంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలతో సహ ఇంకా అనేక ఇతర మతాలూ ఒకే విధంగా ప్రవర్తించాయి. ఒకప్పటి మాతృస్వామ్య వ్యవస్థను పితృస్వామ్య వ్యవస్థగా మార్చేశాయి. మూలవాసుల్ని అణగదొక్కి, వలసవచ్చిన వారే అధికారం చేపట్టినట్టు ప్రపంచవ్యాప్తంగా పరిస్థితి ఒకే విధంగా ఉంది. మతాలన్నీ స్త్రీలకు నీచమైన నియమనిబంధనల్ని రాసిపెట్టాయి. అరబ్ దేశాల వృద్ధులు, వారికి మనుమరాళ్ళ వయసులో ఉన్న ఇక్కడి బాలికల్ని వివాహం చేసుకుని, తీసుకుపోయి, వారిని బానిసలుగా వాడుకోవడం మనం ఇప్పటికీ చూస్తూనే ఉన్నాం. మతాలు గొప్పవైతే అవి వాటి గొప్పతనాల్ని కాపాడుకున్న దాఖలాలు ఎక్కడా కనిపించవు.

**బైబిల్‌లో** ఆడవారి గురించి ఇలా ఉంది – అక్క చెల్లెల్ని చూసి 'నిన్న రాత్రి తండ్రితో నేను శయనించితిని.ఈ రాత్రి అతనితో నీవు శయనించు – ఆ విధంగా లోతు ఇద్దరు కమార్తెలు తమ తండ్రి వలన గర్భవతులైరి. వారు క్రైస్తవ మతమునకు మూల కారకులు (బైబిల్ ఆదికాండం 19 : 31–38) అన్న చనిపోయినా పిల్లలకోసం మరిది వదినను పెళ్ళి చేసుకోవాలి. లేకపోతే వెలివేయబడతారు (ది తియోపదేశ కాండము 25:12) నీవు చూచుచుండగానే నేను నీ భార్యను తీసి, నీ చేరువవాని కప్పగించెదను. పగటి యందు వానితో శయనించును(–2 సమూయేలు 12:11) భర్త గల స్త్రీ కంటే ఒంటరి స్త్రీ ఎక్కువ మంది పిల్లలను కంటుంది అని యెహోవా చెపుతున్నాడు ( యోషయా 54:1) స్త్రీలు వలల మాదిరి ప్రమాదకారులు. వారి హృదయాలు వలల్లాంటివి. వాళ్ల చేతులు గొలుసుల్లాంటివి. స్త్రీ చేతిలో చిక్కడం మరణం కంటే హీనం. వెయ్యి మందిలో ఒక్క స్త్రీ కూడా మంచిది కనబడలేదు (ప్రసంగి : 7: 26–29) పొద్దునలేస్తే వార్తాపత్రికల్లో, మీడియాలో, సోషల్ మీడియాలో ప్రముఖంగా కనిపిస్తున్న వార్తలు – మానభంగాలు, హత్యలు, గృహహింస, ఆత్మహత్యలు వగైరా. వీటన్నింటికీ స్త్రీల పట్ల మతాలు నేర్పించిన అభిప్రాయాలు కారణం అవునా? కాదా? మనిషి నైతిక పతనానికి ఇవి కారణం అవుతున్నాయా? లేదా? – విశ్లేషించుకోవాలి. మత భావనల్ని వదిలించుకోలేని జనం, మరి వాటినే ప్రామాణికంగా తీసుకుంటున్నారు కదా ?

భారత మాజీ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి ఒకసారి ఇలా అన్నారు. "నా లాగా భర్త లేని స్త్రీలు మన భారత దేశంలో చాలా మంది ఉన్నారు. వాళ్ళంతా గుళ్ళలోకి రాకూడదు అనే దుష్ట సంప్రదాయాన్ని మీరు ప్రవేశపెట్టారు. అనుసరిస్తున్నారు. కానీ, నాలాంటి విధవరాలు కూడా దేశాన్ని పరిపాలించే హక్కు, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం రాజ్యాం గం ప్రసాదించింది. నన్ను గుళ్లోకి రావొద్దని ఆంక్షలు విధించిన వారిని సైతం శాసించే అధికారాన్ని ప్రధానమంత్రిగా నాకు రాజ్యాంగమిచ్చింది."– రామాయణంలో రాముడు సీతను అడవులకు తీసుకుపోయాడు. మరోసారి ఒంటరిగా అడవి పాలు చేశాడు. బాబాసాహెబ్ రాజ్యాంగం ద్వారా స్త్రీలకు సమానహక్కులు కల్పించాడు. వారిని అసెంబ్లీ కి, పార్లమెంటుకూ పంపించాడు. ఒక కల్పిత పాత్రకు భజనలు చేస్తూ కూర్చోవడమా? లేక మానవుడి ఔన్నత్యాన్ని పెంచిన రాజ్యాంగ స్ఫూర్తితో మానవీయ విలువల్ని స్థాపించు కోవడమా? అందరూ ఆలోచించుకోవాల్సిన సమయమిది! ముఖ్యంగా స్త్రీలు ఆలోచించు కోవాల్సిన విషయమిది!!

సుప్రసిద్ధ సాహితీ వేత్త, బయాలజీ ప్రొఫెసర్

# ఎంపి ఎన్నికల తరువాత బిఆర్ఎస్ గల్లంతు

## వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రేవూరి



**ప్రజాపక్షం/తొర్రూరు :** దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక ఎన్నికల తరువాత తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ గల్లంతు అవుతుందని వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జ్, పరకాల ఎంఎల్ఎ రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం మహబాదు జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి నియోజక వర్గ స్థాయి ముఖ్య నాయకుల పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత పది సంవత్సరాలు దేశాన్ని పాలించిన బిజెపి, రాష్ట్రాన్ని పాలించిన టిఆర్ఎస్ పార్టీ అప్పుల పాలు చేశాయని, ప్రజలు బిజెపి, బిఆర్ఎస్‌లను నమ్మే పరిస్థితిలో లేరని, ఇప్పటికే బిఆర్ఎస్ ప్రజాప్రతినిదులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలకు హామి ఇచ్చిందని, ఇప్పటికే మూడు గ్యారంటీ పథకాలు అమలు చేస్తున్నదని, త్వరలోనే మరో మూడు పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణలో 14 ఎంపి సీట్లను కాం గ్రెస్ గెలుచుకుంటుందని, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడోద్దన్నారు. పాలకుర్తి ఎంఎల్ఎ యశస్వినీరెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని, అందుకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతానన్నారు. పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనతికాలంలోనే ప్రజల మన్ననలను పొందిందని, మరిన్ని పథకాలతో ప్రజల ముందుకు వస్తుందన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అందరం కలిసి కట్టుగా కృషి చేసి లక్ష ఓట్ల మెజార్టీ వచ్చే విధంగా కృషి చేద్దామన్నారు. ఎవరూ అధైర్య పడోద్దని, కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత నాదేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిరంజన్ రెడ్డి, హమ్యా నాయక్, కాకిరాల హరి ప్రసాద్, సుంచు సం తోష్, సోమ రాజశేఖర్, పాల్గొన్నారు.



## పకడ్బందిగా పోస్టల్ బ్యాలెట్స్

### కలెక్టర్ రిజ్వాన్ బాషా

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** లోక్‌సభ ఎన్నికల నిర్వాహన నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్స్ ప్రక్రియను అంత్యంత పకడ్బందిగా నిర్వయించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ హాల్‌లో సెక్టోరల్ అధికారులు, పోస్టల్ బ్యాలెట్ టీంలతో శిక్షణ కార్యక్రమం నిర్వయించి మాట్లాడారు. 85 ఏండ్లు నిండిన వయోవృద్దులు, దివ్యాంగులు, ఎసెన్సియల్ సర్వీసెస్ ఓటర్లు, కోవిడ్ బాధితులు, తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎన్నికల కమీషన్ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందన్నారు. 85 ఏండ్లు నిండిన వృద్దులు, దివ్యాంగులు ఇంటి నుండే ఓటు హక్కు వినియోగించుకోవచ్చునని, దీని కోసం ఫాం 12డి ద్వారా ఈ నెల 23 వరకు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 3 నుండి 8వ తేదీ లోగా ఓటును వినియోగించుకోవాలన్నారు. ఫార్మ్ 13ఎ, 13బి, 13సిలో పోస్టల్ బ్యాలెట్ పేపర్ సీరియల్ నెంబర్ అటెస్టెడ్ చేయడంతో పాటు సరియైన వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి తప్పులు జరగకుండా క్షుణంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. ప్రతి ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద ప్లెక్సీలు ఏర్పాటు చేయాలని, నిబంధనల మేరకు ఆయా ప్రక్రియలు పూర్తి చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను సెల్‌పోన్లు అనుమతించరాదని, అదే విధంగా ప్రతి రోజు పోస్టల్ బ్యాలెట్ వివరాలు రిజిస్టర్ చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై అధికారులకు పోస్టల్ బ్యాలెట్ పై పవర్ పాయింట ప్రజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిక్షణ నిర్వాహన నోడల్ అధికారి జెడ్‌పి సిఈఓ అనిల్‌కుమార్, సెక్టోరియల్ అధికారులు, పోస్టల్ బ్యాలెట్ టీం సిబ్బంది పాల్గొన్నారు.




## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధికారుల ఇష్టారాజ్యం

### మండల సభలో మండిపడ్డ ఎంపిపి

**ప్రజాపక్షం/జఫర్గడ్ :** జఫర్గడ్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అధికారులకు సమాచారం ఇవ్వకుండా వారి ఇష్ట రాజ్యాంగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారని ఎంపిపి రడపాక సుదర్శన్ మండల సభలో మండిపడ్డారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రడపాక సుదర్శన్ ఆధ్వర్యంలో మండల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్‌పిటిసి బేబీ శ్రీనివాస్, ఎంపిపి సుదర్శన్ మాట్లాడుతూ మండలంలో రబీ సీజన్లో ఐకెపి అధికారులు వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు గానీ, ప్రజాప్రతినిదులకు వివిధ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ప్రొటోకాల్ పాటించడం లేదని అన్నారు. కేవలం వారు వచ్చి గ్రామాల్లో ప్రారంభించే వరకు ఎవరికీ తెలియడం లేదని, సమాచారం ఇవ్వకుండా కొనుగోలు కేంద్రాన్ని ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. అంతే కాకుండా కొన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు లేకపోవడం వల్ల పక్క గ్రామాలకు వెళ్లి రైతులు ధాన్యాన్ని అమ్ముకోవాలంటే ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని, ఇప్పటికైనా అధికారులు గుర్తించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నారు. అంతే కాకుండా కల్యాణ్ లక్ష్మి కింద 161 మందికి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందించాలని, సంవత్సరం అయినా ఇంతవరకు ఇవ్వలేదని వెంటనే అందించాలని ఎంపిపి తెలిపారు. తహసీల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ ఉన్నందున చెక్కులను ఇవ్వలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సుమన్ పాల్గొన్నారు.



## పాఠశాలల్లో మౌలిక వసతులకు అమ్మ కమిటీలు కృషి చేయాలి

### హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** పాఠశాలల్లో మౌలిక వసతులకు అమ్మ కమిటీలు కృషి చేయాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలం నాగయ్య పల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల, లింగమడుగు పల్లిలో ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజేందర్, ఎంపిడీఓ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బైక్‌ను ఢీకొట్టిన ప్రైవేటు ట్రావెల్ బస్సు

### తండ్రీకొడుకులు అక్కడికక్కడే మృతి

**ప్రజాపక్షం/తొర్రూరు రూరల్ :** మహబాదు జిల్లా తొర్రూరు మండలం మాటేడు గ్రామ శివారులో ఓ ప్రయివేటు ట్రావెల్ బస్సు పల్సర్ బైక్‌ను ఢీకొట్టగా తండ్రి, కొడుకులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహబాదు జిల్లా చిన్నగూడూరు మండలం గుండం రాజుపల్లి గ్రామానికి చెందిన తండ్రి, కొడుకులు జక్కుల హరీష్ (35), జక్కుల తేజ (5) ఇద్దరు కలిసి పల్సర్ బైక్‌పై తొర్రూరు నుండి దంతాలపల్లి వైపు వెళ్తుండగా మాటేడు శివారు ఉదయ పూర్వక హోటల్ సమీపంలో ప్రయివేటు ట్రావెల్ బస్సు ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో తండ్రి కొడుకులు ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృత దేహాలను మహబాదు ఏరియా ఆసుపత్రి మార్చ్యూరీకి తరలించినట్లు ఎస్ఐ జగదీష్ తెలిపారు.

## అకాలవర్షంతో తడిసిన ధాన్యం

### అన్నదాతల ఆందోళన



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** ప్రకృతి కన్నెర్ర చేయటంతో అకాల వర్షం మూలంగా సిద్దిపేట జిల్లాలో ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం తడిసి ముద్దవటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల పండించిన పంటలను ధాన్యం విక్రయకేంద్రాలకు తీసుకొచ్చి విక్రయించే లోపే అకాల వర్షం మూలంగా పలు ప్రాంతాల్లో ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అరకొర వసతుల మూలంగా తడిసిన ధాన్యం రైతుకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయన్నారు. సిద్దిపేట జిల్లా పరిధిలో గత వారం రోజుల క్రితం తీసుకొచ్చిన ధాన్యం కొనుగోలు చేయకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి దాపురించింది. ప్రభుత్వం తడసిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

**తడసిన ధాన్యన్ని పరిశీలించిన బిఆర్ఎస్ నేత వేణుగోపాల్‌రెడ్డి**

సిద్దిపేట వ్యవసాయ మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యాన్ని బిఆర్ఎస్ నేత మచ్చ వేతుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని చూపించిన రైతులతో ముచ్చటించారు. తమను ఆదుకోవాలని రైతులు కోరారు. ఈసందర్భంగా బిఆర్ఎస్ నేత మచ్చ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని ఏలాంటి కటింగ్‌లు లేకుండ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తడిసిన ధాన్యాన్ని ఒక్క గింజలేకుండ ప్రభుత్వమే కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసే వరకు రైతుల పక్షాన పోరాటం చేస్తామని, రైతులకు అండగాఉంటామని హామీనిచ్చారు. అలాగే సిద్దిపేట మార్కెట్‌యార్డులో రైతులకు అవసరమగు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అలాగే మార్కెట్ యార్డులో నెల కొన్న హామాలీ కార్మికుల సమస్యలను,లారీల సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మద్దతుధర కంటే తక్కువకు అమ్మకూడదు

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** రైతులు మద్దతు ధర కంటే తక్కువకు అమ్మకూడదని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడం జరిగిందని వ్యవసాయ మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డులో ప్రైవేట్ వ్యాపారులు కనీస మద్దతు ధరకు వ్యవసాయ ఉత్పత్తులను కొనేందుకు సిద్దంగా లేకపోవడంతో జిల్లా యంత్రాంగం ఎలాంటి వ్యవసాయ ఉత్పత్తులను యార్డులోకి అనుమతించకూడదని నిర్ణయించిందన్నారు.కావున రైతులు ఎవరు కూడా తమ ఉత్పత్తులను తీసుకొని మార్కెట్ యార్డుకు రావొద్దని తెలిపారు. రైతులు తమ గ్రామాలలోని ఐకేపీ, పీఏసీఎస్ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలతోపాటు మార్కెట్‌యార్డుకు ఆనుకొని ఉన్న పీఏసీఎస్ కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయడం జరిగిందని వాటిలో వరి ధాన్యాన్ని అమ్ముకొని మద్దతు ధర గ్రేడ్‌ఏ రూ. 2,203, కామన్ రకానికి రూ. 2,183 పొందాలని సూచించారు.కావున రైతులు జిల్లా యంత్రాంగం తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు జనగామ మార్కెట్ యార్డుకు తమ ఉత్పత్తులను తరలించొద్దని సూచించారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి చిత్ర మిశ్రా




**ప్రజాపక్షం/ఏటూరునాగారం :** మన చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి చిత్ర మిశ్రా అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఐటిడిఎ కాలనీ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించడంతో పిఓ ఆదేశాల మేరకు ఐటిడిఏ కార్యాలయ సిబ్బంది చుట్టూ పరిసరాలలో పేరుకుపోయిన చెత్త చెదారం, పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. అధికారులు పరిసరాలను శుభ్రం చేయించడం అభినందనీయమని అధికారుల తీరుపై ప్రశంసల జల్లు కురిపించారు.

## ఆరు గ్యారంటీలు అమలు కాలేదు

### మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలను ఇచ్చి అధికారం చేపట్టిందని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫల మైందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి,బిఆర్ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్ అన్నారు. శనివా రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి,మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ఆద్వర్యంలో వరంగల్ పార్లమెంట్ స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ ఇంచార్జీ స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ మంత్రి బసవరాజ్ సారయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు బిఆర్ఎస్ కార్యకర్తలను బెదిరించి అక్రమ అరెస్టులు చేసి బయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇటీవలే కాలంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబును పోలీసులు అక్రమంగా భూ కబ్జా చేశారని సంబంధంలేని విషయంలో అరెస్టు చేశారని చెప్పారు.అధికారం వస్తది పోతది పోలీసు అధికారులు అత్యుత్సహం చూపరాదని అన్నారు. కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చిన పార్టీ తరుపున అండగా ఉంటామని అన్నారు. కక్షపూరిత రాజకీయాలు మానుకొని నియోజకవర్గ అభివృద్ధి,రైతు రుణమాఫి,ప్రజలకు ఇచ్చిన హామీలైన ఆరుగ్యారంటిల అమలు చేయాలని కోరారు. ఉద్యమ కారుడు సుధీర్ కుమార్ ను వరంగల్ ఎంపిగా అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. ఉద్యమకారునిగా వరంగల్ పార్లమెంట్ అభివృద్ధి కోసం కృషిచేస్తానని, ప్రజలకు ఇచ్చిన ప్రభుత్వ హామీల అమలుకు పోరాటాలు చేస్తానని మీరు ఆదరించి ఎంపిగా గెలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాంబారి సమ్మారావు, మాజీ రాష్ట్ర వికళాంగుల చైర్మన్ వాసుదేవరెడ్డి జెడ్పీ వైస్ చైర్ పర్సన్ కల్లెపు శోభ రఘుపతి రావు,మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకట రాణి సిద్దు,మాజీ గ్రంధాల సంస్థ చైర్మన్ బుర్ర రమేష్‌గౌడ్,పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్, ఎంపిపి మందల లావాణ్య విద్యాసాగర్ రెడ్డి,స్థానిక కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

## అంతర్‌జిల్లా దొంగలముఠా అరెస్టు

### 40 తులాల బంగారం, 4 బైక్‌లు, 33.50 లక్షల విలువ సొత్తు స్వాధీనం : సిద్దిపేట సిపి డాక్టర్ అనురాధ




**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసి 40 తులాల బంగారం, 4 బైక్‌లు, 33.50 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ వెల్లడించారు. సిద్దిపేట. సిరిసిల్లా జిల్లా పరిధిలో 33 వరుస దొంగతనాలకు పాల్పడిన సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం బీబీ నాయక్ తండాకు చెందిన రాథోడ్ నగేశ్, జాదవ్ బాలరాం, జాదవ్ పుండలికం, కామారెడ్డి జిలాల యెల్లారెడ్డి మండలం వెల్లుట్ల తండాకు చెందిన కేత్యావత్ రాజును అరెస్టు చేసినట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం చంద్రానాయక్ తండాకు చెందిన జాదవ్ జైరామ్ పరారిలో ఉన్నట్లు సిపి తెలిపారు. సిద్దిపేట, సిరిసిల్లా జిల్లా ల పరిధిలో 33 దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. పోలీసుల విచారణలో తాము గత జనవరి నుండి మూడు నెలలుగా ఇంటి తాళం వేసి ఉన్న ఇండ్లను లక్ష్యంగా పెట్టుకొని వరస దొంగతనాలకు పాల్పడి, బంగారు, వెండి నగలను పంచుకున్నట్లు తెలిపారు. వరుస దొంగతనాలపై ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తొగుట సిఐ లతీఫ్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో నిందితులను అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా పరిధిలో తొగుట, దౌల్తాబాద్, కుకునూర్‌పల్లి. రాయ్‌పోల్, మిరుదొడ్డి, దుబ్బాక,సిద్దిపేట రూరల్, గౌరారం,కొమురవెల్లి పరిధిలో 30 కేసులను ఛేధించినట్లు తెలిపారు. అలాగే రాజన్న సిరిసిల్లాకు చెందిన మరో 3కేసులను ఛేదించినట్లు తెలిపారు. వీరి వద్ద నుండి 40.6 తులాల బంగారం, 55 తులాల వెండి, నాలుగు ద్వీచక్ర వాహనాలు, రెండు ఐరన్ రాడ్లు రికవరి చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుండి 33.50.600 విలువ బంగారు నగలు రికవరీ చేసినట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్ పంపించినట్లు తెలిపారు. దొంగలను పట్టుకోవటంలో ప్రత్యేక టీంను పర్యావేక్షించిన అదనపు సిపి మల్లారెడ్డి, ఏసిపి పురుషోత్తంరెడ్డి, ప్రత్యేక బృంద సభ్యులు ఎస్‌కె లతీఫ్, ముత్యంరాజు, భువనేశ్వర్‌రావు, కానిస్టేబుళ్లు మధుసూదన్ రెడ్డి, శ్రీకాంత్, రమేశ్, సురేష్, రాజు, నవీన్, వెంకటేశ్‌లను సిపి అనరాధ అభినందించి, నగదురివార్డులతో సత్కరించారు.



## పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శనివారం కలెక్టరేట్ మిని కాన్ఫరెన్స్ హాలు నందు భూపాలపల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణపై మున్సిపల్, సింగరేణి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు శాఖల మధ్య సమన్వయ లేకపోవడం వల్ల పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా జరగడం లేదని అన్నారు. సింగరేణి సంస్థ పరిధిలోని అవాసాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాల్సిన బాధ్యత సంస్థదేనని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉందని, పారిశుధ్య కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రతి రోజు ఇంటింటి నుండి తడి, పొడి వ్యర్ధాల సేకరణ జరగకపోతే అట్టి వ్యర్ధాలు మురుగు కాలువల్లో వేస్తుంటారని తద్వారా మురుగునీరు నిల్వలు పేరుకుపోతాయని అన్నారు. మున్సిపల్ కమిషనర్ సోమవారం నుండి అన్ని వార్డుల్లో ద్వి చక్ర వాహనంపై పర్యటించి అన్ని వార్డులను తనిఖీ చేయాలని తెలిపారు. ఎక్కడైనా వ్యర్ధాలు పేరుకు పోతే తక్షణమే నోటీస్ జారీ చేసి ఫైన్ విధించాలని ఆదేశించారు. రామప్ప కాలానికి వెళ్ళు మార్గంలో వ్యర్ధాలు పేరుకుపోయానని ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పరిశుభ్రం చేయాలని సింగరేణి అధికారులకు సూచించారు. ప్రతి ఇంటి నుంచి తడి,పొడి వ్యర్ధాలు సేకరించాలని, నిరంతరాయంగా జరగకపోవడం వల్ల అపరిశుభ్రత ఏర్పడుతుందన్నారు. వ్యర్ధాలను ఆరుబయట వేస్తే జరిమానా విధించాలని అన్నారు. దుకాణాల ముందర వ్యర్ధాలు వేయొద్దని వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేయాలని ఆయన సూచించారు. సింగరేణి, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పట్టణాన్ని పరిశుభ్రంగా తయారు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, సింగరేణి అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఇబ్బందులు రాకుండా తాగునీటి సరఫరా

### జిల్లా అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** ప్రజలకు ఇబ్బంది కలగకుండా తాగునీటి సరఫరా నిరంతరం అందించడంతోపాటు పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు, సంపదవనాల నిర్వహణ సక్రమంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని గోపాల్‌నగర్ గ్రామ పంచాయితి పరిధిలోగల పల్లెప్రకృతి వనాలు, నర్సరీలు, ఉపాధి హామీ పనులు, నర్మెట మండలంలోని గండిరామారం, బొమ్మకూర్ గ్రామ పంచాయతీలోని సంపద వనాలను పింకేశ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయితి కార్యదర్శులతో ఆయన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ మాట్లాడుతూ నర్సరీలలో మొక్కలకు నిరంతరం నీరు అందించాలని, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.పల్లె ప్రకృతి వనాలలో పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయితి పరిధిలో 200ల మంది కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. వారికి మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. సంపద వనాలలో పెద్ద మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో మొగులప్ప, అడిషనల్ డీఆర్డీవో చంద్రశేఖర్, డీఎల్పీవో పార్ధసారధి, ఎంపీడీవో రఘురామకృష్ణ, నర్మెట ఎంపీడీవో ఖాజా మొయినుద్దీన్, ఏపీవో కృష్ణయ్య, టీఏ కరుణాకర్, స్వామి, ఈసీ జగదీష్, పంచాయితి కార్యదర్శి కవిత, భరత్, కిశోర్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## తిగుల్ ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ



ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్ ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం ఆసుపత్రిని తనిఖీ చేసిన ఆయన రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. సిబ్బంది సమయ పాలన పాటించి మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. వేసవి దృష్ట్యా ఆసుపత్రిలో ఓఆర్ఎస్ ప్యాకేట్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఔట్ పెషేంట్లకు సరైన వసతులు కల్పించాలని, ఇన్ పెషేంట్లుగా ఉన్నవారికి ఎప్పటికప్పుడు మెరుగైన వైద్యం అందించాలని పేర్కొన్నారు. ఉఫాది హామీ కూలీలు వడ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉన్నందున ఆశ వర్కర్ల ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. వీరి వెంట డిప్యూటీ డిఎం అండ్‌హెచ్ఒ డాక్టర్ శ్రీనివాస్, తిగుల్ వైద్యాధికారి రాజశేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



## 41 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

### కేసు నమోదు చేసిన సిద్దిపేట పోలీసులు

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సిద్దిపేట త్రీటౌన్ పోలీసులు పట్టుకున్న సంఘటన శనివారం వెలుగుచూసింది. తెలంగాణ ధర్మకాంట పరిధిలోని బోలెరో వాహనంలో సిద్దిపేటకు చెందిన మహమ్మద్ షారుక్ ఎలాంటి అనుమతి లేకుండా రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణ చేస్తున్నారనే సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్ పోర్స్ పోలీసులు దాడి చేసి తనిఖీలు చేపట్టగా 41 క్వింటల్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎఫ్ రైస్ అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## కట్టుదిట్టంగా వాహనాల తనిఖీ

### అదనపు ఎస్‌పి వినోద్ కుమార్



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని కట్టుదిట్టంగా తనిఖీ చేపట్టాలని జిల్లా అదనపు ఎస్‌పి వినోద్ కుమార్ సిబ్బందికి సూచించారు. శనివారం మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు కేంద్రాన్ని సందర్శించి వాహనాల తనిఖీ చేపట్టారు. ఏలాంటి పత్రాలు లేకుండా నగదు పట్టుబడితే సీజ్ చేసి సంబంధిత అధికారులకు అందజేయాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మెట్‌పల్లి సిఐ నవీన్, మల్లాపూర్ ఎస్ఐ కిరణ్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ప్రైవేట్ బస్సులపై స్పెషల్ డ్రైవ్



**ప్రజాపక్షం/కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం కోరుట్ల మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ యం.శ్రీనివాస్ ప్రైవేట్ స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. బస్సుల కండిషన్, ధృవపత్రాలు పరిశీలించిరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ బస్సుల యజమాన్యానికి, స్కూల్ బస్సుల డ్రైవర్లకు సూచనలిస్తు బస్సులో పరిమితికి మించి బడి పిల్లలను ఎక్కించకూడదని, బస్సులకు సంబంధించిన ధ్రువపత్రాలు, టాక్స్, ఇన్సూరెన్స్, పర్మిట్, ఫిట్‌నెస్, పొల్యూషన్ అన్ని ధ్రవపత్రాలు కలిగి ఉండాలని, బస్సు డ్రైవర్లకు తప్పనిసరి డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని లేనిచో వారిపై కఠిన చర్యలు తీసుకొని ఆ బస్సులను సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎంవిఐయం శ్రీనివాస్, కానిస్టేబుల్ గిరీష్ పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఎ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/కడెం :** ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కల్లెడ మాజీ సర్పంచ్ తాటి సంజీవ్ పటేల్, కల్లెడ బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షులు కొడిమ్యాల నర్సయ్య. బెల్లాల్ గ్రామ బీజేపి, బిఆర్ఎస్ నాయకులు చెన్ను మల్లేష్ యాదవ్, కందుల సునీల్ కాంగ్రెస్‌లో చేరారు, వారికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బరుపటి రమేష్ వర్మ నాయకులు భూషణ్, రమేష్, సాధని రాజన్న, కన్నె శ్రీనివాస్, వెంకటేస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి

### మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/కడెం :** పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా జన్నారం మండలానికి ఎన్నికల ప్రచారనికి వచ్చిన మంత్రి సీతక్కని నిర్మల్ జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేష్‌వర్మలు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్లమెంట్ అభ్యర్థి సుగుణక్కని భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి సీతక్క సూచించారని తెలిపారు. కార్యక్రమంలో జన్నారం మండల అధ్యక్షులు ముజాఫర్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** రంగోత్సవ్ ఫౌండేషన్ ముంబాయి నిర్వహించిన అంతర్జాతీయ పోటీలలో జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్, గ్రీటింగ్ కలరింగ్ కొలాజ్, టటూ, ఫోటోగ్రాఫీ, తదితర పోటీల్లో పాల్గొన్నారు. జాస్యా బేగం, కాస్య వైశ్విక, తొట్ల మనోజ్‌కుమా, గ్రీష్మ, రిషిత, దివ్య, సాహితి ప్రతిభ కనబర్చిన వారిలో ఉన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్డ్, వైస్‌ప్రిన్సిపాల్ కె.నగేష్, పోటీల జిల్లా కన్వీనర్‌కు వనపర్తి రాజశేఖర్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ,అరుణ్‌కిరణ్, మురళీధర్, రాకేష్, ప్రవీణ్, రవికుమార్, సంధ్యారాణి, రమాదేవి, హరిప్రియ, అర్చన, అన్నపూర్ణ పాల్గొన్నారు.

## విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాటాలు : ఎఐఎస్‌ఎఫ్



**ప్రజాపక్షం/బోథ్ :** విద్యలో గుణాత్మకమైన మార్పు కోసం ఎఐఎస్ఎఫ్ పోరాటం చేస్తుందని ఇందుకోసం విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాడుతుందని సంఘం అధ్యక్షుడు మున్సిఫ్ అన్నారు. శనివారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నీట్, ఇవ్‌సెట్ నమూనా పరీక్షను మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా, నరేష్, ముక్రాం పాల్గొన్నారు.

**జగిత్యాల ప్రతినిధి:** ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలు జగిత్యాల జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. ఆల్ఫోర్స్, శ్రీచైతన్య, ఎన్ఎస్‌వి, నవ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షలు రాశారు. ఈ సందర్భంగా శ్రీచైతన్య జూనియర్ కళాశాల చైర్మన్ ముసిపట్ల రాజేందర్ మాట్లాడుతూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈమోడ్ ఎంసెట్ నీట్ పరీక్షలు విద్యార్థులకు సన్నాహకం కావడానికి ఉపయోగపడతాయన్నారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అక్రమాలిక్ మాట్లాడుతూ మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ కళాశాల యజమాన్యాలు ప్రిన్సిపల్ నరేష్, రమేష్, గాలిపెల్లి ఈశ్వర్, రజనీ, భూమయ్య, సతీష్, సంతోష్, ఎఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు శివ సాయిరెడ్డి, రాహుల్, నాగరాజు, ఆశ్వక్, సంజయ్, వినీత్, సులేమాన్, మనోజ్‌కుమార్, సాయికుమార్, సాయికిరణ్, మూసిబ్, నాగరాణి, సౌమ్య, అర్ష, గౌతమీ పాల్గొన్నారు.




# కష్టపడి పనిచేస్తే ఎన్నికల్లో మనదే విజయం

### మంత్రి పొన్నం ప్రభాకర్





**ప్రజాపక్షం/వేములవాడ :** రాజన్న సిరిసిల్ల జిల్లా డిసిసి అధ్యక్షుడు; ప్రభుత్వ విప్; వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అధ్యక్షతన వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కష్టపడి పనిచేస్తే ఎంపి ఎన్నికల్లో మనదే విజయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకు గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించాం.. ఆగస్టు 15 లోపు పంట రుణమాఫీ చేస్తామని ఇప్పటికే చెప్పాం. ఈ పథకాలపై ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. మిడ్‌మానేరు ముంపు గ్రామాల్లో గత ముఖ్యమంత్రి కెసిఆర్ తన అత్తగారు ఊరు అని హామీ ఇచ్చి నెరవేర్చని అసమర్థుడు అన్నారు. సిరిసిల్లకి రావాల్సిన టెక్స్‌టైల్ పార్కు వరంగల్‌కు తరలించిన అసమర్థుడు వినోద్‌కుమార్ అని, నీది వరంగల్ అని టెక్స్‌టైల్ పార్కు అక్కడికి తరలించారా అని ప్రశ్నించారు. కరీంనగర్‌లో వినోద్‌కుమార్‌కి ఓటు అడిగే హక్కు లేదన్నారు. కవిత అరెస్టుపై డ్రామా ఆడుతున్నారన్నారు. మరోమారు కేంద్రంలో బిజెపి అధికారంలోకి వస్తే అంబేద్కర్ రాజ్యాంగానికి, బదులు నియంతృత్వం వస్తుందన్నారు. రాముడి పేరు మీద బండి సంజయ్ ఓట్లు భిక్ష అడుగుతున్నాడన్నారు. నరేంద్ర మోడీ పది సంవత్సరాల పాలనలో తెలంగాణకు ఎం ఇచ్చారో బండి సంజయ్ చెప్పాలన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరి కృషితోనే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచానన్నారు. అసెంబ్లీ ఎన్నికలను స్ఫూర్తిగా తీసుకుని మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారెంటీలు అమలు జరుగుతుందన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఇప్పటికే విటిఏడిఏ సమావేశం ఏర్పాటు చేసుకున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.20కోట్లు నిధులను మంజూరు చేయించుకున్నామని, మిడ్ మానేరు ముంపు గ్రామాల సమస్యల పరిష్కారానికి మంత్రి పొన్నం, తాను కలిసి ఇప్పటికే సీఎంతో చర్చించడం జరిగిందన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారంతో పాటు యువతకు ఉపాధి కల్పించే అంశాలపై చర్చించడం జరిగిందని, త్వరలోనే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో ఒడితల ప్రణవ్, కోడూరి సత్యనారాయణ, ఆరెపల్లి మోహన్, వెలిచాల రాజేందర్, జిల్లా కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకూ న్యాయం

### మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/కుంటాల :** కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజాలకు న్యాయం జరుగుతుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. శనివారం మండలంలోని కల్లూర్ గ్రామంలో మంత్రి సీతక్క రోడ్ షో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అదిలాబాద్ కాంగ్రెస్ పార్టీపార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను భారీ మెజర్టితో గెలిపించాలని కోరారు. రూ.500లకే గ్యాస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులకు రూ.2లక్షల పంట రుణమాఫీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. పోడు రైతులకు పట్టాలు ఇచ్చి ఆ భూమిపై హక్కు కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ, డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు, నారాయణరావు పటేల్, మాజీ ఎమ్మెల్యేలు విట్టల్ రెడ్డి, రేఖ శ్యాంనాయక్, జడ్పిటిసి కొత్తపల్లి గంగామణి, బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.



### ఇంద్రవెల్లి అమరవీరులకు నివాళి

**నిర్మల్ రూరల్ :** ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) శనివారం ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఇంద్రవెల్లి అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. వారి త్యాగాలు వృధా పోలేదన్నారు. జల్ జంగల్ జమీన్ కోసం తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాడి ప్రాణాలర్పించిన అమరవీలుల త్యాగం వెలకట్టలేనిన్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, ఆడే గజేందర్, శ్యామ్ నాయక్, రాథోడ్ బాపురావు,సయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ సెగ్మెంట్‌లకు ఇవిఎంల తరలింపు

### పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు ఈవీఎం యంత్రాలను తరలిస్తున్నామని పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో గోదాం నెంబర్ 3లోని ఈవిఎం గోదాంను శనివారం అదనపు కలెక్టర్ జివి శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి పరిశీలించారు. పెద్దపల్లి జిల్లా పరిధిలో ఉన్న మూడు అసెంబ్లీ సెగ్మెంట్ల స్ట్రాంగ్ రూమ్‌లకు మొదటి ఈవిఎం ర్యాండమైజేషన్‌లో కేటాయించిన ఈవిఎం యంత్రాలను తరలిస్తున్నామన్నారు. రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్ కు కేటాయించిన 325బ్యాలెట్ యూనిట్లు, 325కంట్రోల్ యూనిట్లు, 364 వివిప్యాట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, టిటిఎస్, ఎన్టిపిసి లో స్ట్రాంగ్ రూమ్ లో భద్ర పర్చడం జరుగుతుందన్నారు. మంథని అసెంబ్లీ సెగ్మెంట్ కు కేటాయించిన 362 బ్యాలెట్ యూనిట్లు, 362 కంట్రోల్ యూనిట్లు, 406 వివిప్యాట్లు జెఎన్టియు కళాశాలలో, పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 362బ్యాలెట్ యూనిట్లు, 362 కంట్రోల్ యూనిట్లు, 406 వివిప్యాట్లు పెద్దపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో భద్ర పర్చడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు

పెద్దపల్లి పార్లమెంటు స్థానానికి మూడవ రోజు ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా గవ్వల శ్రీకాంత్, లింగాల లచ్చయ్య , మేకల అక్షయ్ కుమార్, జాడి ప్రేమ్ సాగర్ , కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కట్కూరి సందీప్, పిపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) పార్టీ అభ్యర్థిగా మోతె నరేష్ తలా ఒక సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని, ఇప్పటి వరకు మూడు రోజులు కలుపుకొని పద మూడు మంది అభ్యర్థులు నామినేషన్ లు దాఖలు చేసినట్లు తెలిపారు.

## ప్రజాఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం తగదు

### ఎస్‌పి సురేష్ కుమార్




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్‌పి కె.సురేష్‌కుమార్ ఆసిఫాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను శనివారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది హాజరు తీరును, కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. స్టేషన్లో సిసిటిఎన్ఎస్‌లోని ఎఫ్ఐఆర్, చార్జిషీట్, మీసేవ, హెచ్ఆర్ఎంఎస్ అన్ని అప్లికేషన్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచన లు చేశారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారులతో మర్యాద పుర్వకంగా ఉంటూ వారి సమస్యలను విని వాటిని పరిష్కరించాలని, ప్రజలకు మంచి సేవలు అందించేందుకు కృషిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్లైన్లో ఎంటర్ చేయాలని తెలియజేశారు. సిబ్బంది పోలీసు స్టేషన్‌లోని ప్రతి గ్రామం గురించి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలతో మమేకమై, ప్రజలకు మరింత చేరువ కావాలని తెలిపారు. ఉత్తమ పని తీరు కనబరిచిన వారికి ప్రతిఫలం దక్కుతుందని తెలియజేశారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని పోలీస్‌సిబ్బందికి సూచించారు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎలక్షన్స్‌కు సంబంధించి సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల నియమావళి రాజకీయ పార్టీలకు, వ్యక్తులకు అతీతంగా నిష్పక్షపాతంగా పారదర్శకంగా అమలు చేయాలని సూచించారు. స్టేషన్ రికార్డులను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ సిఐ సతీష్, ఎస్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తం

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



**ప్రజాపక్షం/ధర్మపురి :** రాష్ట్రంలో నాలుగు నెలల కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా కొనసాగిందని, దీనిపై ప్రశ్నిస్తే బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ నేతలు దాడులు, దౌర్జన్యాలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. పంట నష్టం వల్ల ఇప్పటికే 209 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మి నరసింహస్వామి వారిని శనివారం కొప్పుల ఈశ్వర్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందరాపు రామయ్య ఇంట్లో మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలు నిర్వహించగా, ఈశ్వర్ స్వయంగా హాజరై కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మీడియాతో మాట్లాడారు. ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు చేపట్టి ప్రజల మనసు దోచుకున్నది తమ బిఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కోటి 20లక్షల ఎకరాలకు సాగునీరు అందించి వ్యవసాయాన్ని పండగలాగా మార్చిందన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో ఎక్కడైనా ఉన్నాడా అలాంటి వ్యక్తికి రాష్ట్రంపై ప్రేమఉంటుందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో వ్యవస్థను నాశనం చేసే పనిలో ఉందన్నారు. బూటకపు హామీలు, మాటలతో మోసపోయి కాంగ్రెస్‌ను గెలిపించారని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బలపరిస్తే ప్రజలు తమకు తాము అభివృద్ధిని నిరోధించుకున్న వారు అవుతారని, రాష్ట్రం సాధించిన పార్టీగా బిఆర్ఎస్ పెద్దపల్లి అభ్యర్థి అయిన తనను గెలిపించాలని కొప్పుల కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, అయ్యోరి రాజేష్, వైస్ చైర్మన్ అక్కనపెల్లి సునీల్, మోకనపెల్లి రాజమ్మ, భీమన్న, శేఖర్, శ్యాం, సాంబు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో స్కూల్ డే




**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మమత ఆధ్వర్యంలో ఈసిసిడే స్కూల్ డే, గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లల తల్లి దండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మంచి అలవాట్లు సంభాషణ ఆటలు పాటలతో కథ సంభాషణ శాస్త్రీయ పరిజ్ఞానం మొదలైన కార్యక్రమాలు తల్లుల ఆధ్వర్యంలో పిల్లలతో చేపించి చూపించడం జరిగింది. ఆరు సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని, వారికి ఆట పాటల ద్వారావిద్యను అందించడం పిల్లలు అందరితో కలిసి మెలిసి ఉండటం బడికి రెడీ అలవాటు చేయడం వంటి నేర్పించడం జరుగుతుందని అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మ్యాడవరం స్వప్న, మానాల తిరుమల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనంద్, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

**ప్రజాపక్షం/పెద్దపల్లిటౌన్ :** భవన నిర్మాణ కార్మిక శాఖ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ట్రైనింగ్ డిపార్ట్మెంట్ తెలంగాణ భవన నిర్మాణ కార్మికశాఖలో నమోదు అయిన కార్మికుల పిల్లలకు ఉచితంగా కెరీర్ గైడెన్స్ మరియు రెస్యూమ్ ప్రిపరేషన్ గురించి పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈకార్యక్రమనికి ముఖ్యఅతిధిగా ఎపిపిసి ప్రాజెక్ట్ లీడ్ దాసరి రాజేంద్ర, ఎపిపిసి ప్రాజెక్ట్ ఇన్చార్జి డి.ప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేంద్ర మాట్లాడుతూ యువతలో నైపుణ్యం కొరతను తీర్చడానికి 41 రకాల కంప్యూటర్ కోర్స్‌లను యాప్ ద్వారా ఆన్లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి అవకాశలు కల్పిస్తుందన్నారు. ప్రకాష్ మాట్లాడుతూ ఏపీపీసీ మరియు తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న ఈ శిక్షణను విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోని ఉపాధి అవకాశలు మెరుగు పరుచుకోవాలన్నారు. అనంతరం 245 మంది విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు.



## పనిచేసే నాయకుడికి పట్టం కట్టండి

### మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** నలభై ఏండ్లుగా ప్రజా జీవితంలో ఉండి జగిత్యాల నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేశాడని నిజమాబాద్ ఎంపీగా జీవన్‌రెడ్డిని గెలిపిస్తే పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తాడని, పని చేసే నాయకుడికి పట్టం కట్టాలని జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఓటర్లను కోరారు. జగిత్యాల పట్టణంలో నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా చైర్‌పర్సన్ జ్యోతి కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, నిరుపేదల సమస్యలు పరిష్కారానికి జీవన్ రెడ్డి మనకు తోడుగా ఉంటారని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని గెలిపంచాలని జ్యోతి ఓటర్లను కోరారు.

# తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

### ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్




**ప్రజాపక్షం /ధర్మపురి :** ధర్మపురి నియోజకవర్గ పరిధిలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతానని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ధర్మపురి పట్టణ తలాపున గోదావరి నది ఉన్నప్పటికి గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా తాగునీటి ఎద్దడి నెలకొందని సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. ధర్మపురి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్ తన దివంగత నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యల జ్ఞాపకార్థం పట్టణ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరా ట్యాంకర్‌ను శనివారం విప్ లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. పట్టణ ప్రజల మంచినీటి సమస్యను గుర్తించి నీటి సరఫరాకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ట్యాంకర్ ఏర్పాటు చేసిన చీపిరిశెట్టి రాజేష్‌ను అభినందించారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ గత ఏడాది వర్షాభావ పరిస్థితులతో పాటు అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గ పరిధిలో నీటి సమస్య జఠిలమైందన్నారు. అయినప్పటికి నీటి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కలెక్టర్ వద్ద రూ.కోటి నిధులు డిపాజిట్ చేసినట్లు ఆయన తెలిపారు. అడుగు దూరంలో గోదావరి ఉన్నప్పటికి సుదూరంలోని డబ్బా ప్రాంతం నుండి నీళ్లు తెప్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం త్వరలోనే కనుగొంటామని అడ్లూరి తెలిపారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం పట్టణ అధ్యక్షులు చీపిరెట్టి రాజేష్, కాంగెస్ పార్టీ అధ్యక్షులు ఎస్. దినేష్, ఉపాధ్యాక్షులు వేముల రాజేష్, నాయకులు జక్కు రవీందర్, చిలుముల లక్ష్మణ్, జె.సుముఖ్, గడిపెల్లి సత్యనారాయణ, సంగి ఆనంద్, ఎస్.నరేందర్, బొంగురాల వాసు, చల్ల కృష్ణ పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకపోతే గోదాములు సీజ్

### మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్



**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని పండ్ల గోదాముల యజమానులు నిబంధనలు పాటించాలని, ఎక్కువ మోతాదు మందులను వాడితే గోదాములను సీజ్ చేస్తామని మంచిర్యాల మున్సిపల్ కమీషనర్ ఎ.మారుతి ప్రసాద్ హెచ్చరించారు. శనివారం మంచిర్యాల పట్టణంలోని పలు పండ్ల గోదాములపై ఆకస్మికంగా పట్టణ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వి.వాసు రామ్‌తో కలిసి ఆయన తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు పండ్ల గోదాములలో సీజన్‌కు అనుగుణంగా మామిడిపండ్లు, సపోట ఇతర పండ్లను పండించే విధానాలను పరిశీలిస్తు ఆయా పండ్ల గోదాముల యజమానులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం పది కిలోల పండ్లకు ఒక ప్యాకెట్ ఇథెప్పన్ మాత్రమే ఉపయోగించాలని, కానీ ఎక్కువ మోతాదులో ఈ ప్యాకెట్లు వాడకూడదని అలా వాడి త్వరగా పండ్లను పండించాలని ఆశపడి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడితే అలాంటి వారిని వదిలేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అలాగే గోదాములను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీలలో కమీషనర్‌తో పాటు మున్సిపల్ రెవెన్యూ అధికారి కె.శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎండి మజార్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాపక్షం/హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సివిల్స్ - 2023 ఫలితాల్లో జాతీయ స్థాయిలో మూడవ ర్యాంకు సాధించిన పాలమూరుకు చెందిన అనన్య రెడ్డి శనివారం కలిశారు. ఈ సందర్భంగా అనన్యరెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు.

## పోటీ పరీక్షల సన్నద్ధత కోసమే ఎఐఎస్‌ఎఫ్ మోడల్ టెస్ట్



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** పోటీ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత కోసమే ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్ నిర్వహించడం జరుగుతున్నదని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రహమాన్ అన్నారు. శనివారం హన్మకొండలో జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాలలో నిర్వహించిన ఎఐఎస్‌ఎఫ్ మోడల్ టెస్ట్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్ పరీక్షలో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురి కాకుండా ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ మోడల్ టెస్ట్ నిర్వహించడం జరుగుతున్నదన్నారు. పరీక్షలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు పరీక్షను ఎలా రాయాలో అనే విషయం ముఖ్యమని, వీటన్నింటిపై ఒక అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజాన్ని చదవాలని, అన్ని రంగాలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, కే. కుమారస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవి తేజ, జిల్లా సమితి సభ్యులు కుంటి పవన్, శ్రీపతి వినయ్, స్పందన, మాలోతు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు భయాందోళనకు గురికావద్దు

### పరీక్ష పత్రాన్ని ఆవిష్కరించిన ప్రొఫెసర్ చంద్రశేఖర్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మోడల్ ఎంసెట్' విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఒయు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ .పి.చంద్ర శేఖర్ అన్నారు. అఖిల భారత విద్యార్థి సమైక్య(ఎఐఎస్‌ఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో 'మోడల్ ఎంసెట్, నీట్' పరీక్షను నారాయణగూడ న్యూ చైతన్య కళాశాలలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పరీక్ష పత్రాన్ని ప్రొఫెసర్ చంద్ర శేఖర్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్ పరీక్షలో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురికావొద్దన్నారు. పరీక్షలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ,కార్యదర్శులు మణికంఠ రెడ్డి , పుట్ట లక్ష్మ ణ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజాన్ని చదవాలని, అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు గ్యార నరేష్ ,నెల్లిసత్య , హైదరాబాద్ అధ్యక్షులు చైతన్య యాదవ్ నాయకులు కళ్యాణ్ ,రంజిత్ పాల్గొన్నారు.

## అడ్మిషన్ల ముసుగులో ఫీజుల మోత



**ప్రజాపక్షం/వరంగల్ :** ఇంకా విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే ప్రైవేట్ కార్పోరేట్ స్కూల్స్ 2024 — 25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ముసుగులో ఫీజులు మోత మోగిస్తున్నాయని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ అన్నారు. వరంగల్ తమ్మెర భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని శరత్ మాట్లాడుతూ కొన్ని స్కూల్స్‌లో అప్పుడే అడ్మిషన్ పూర్తయినట్టు ప్రైవేట్ కార్పోరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు చెప్పడం బాధాకరమన్నారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజులు కొంత తక్కువగానే ఉండగా మిగిలిన ప్రైవేట్ కార్పోరేట్ పాఠశాలలో మాత్రం ఫీజుల పేరు తో వసూలు దందా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ప్రైవేట్, కార్పోరేట్, ఇంటర్నేషనల్ యాజమాన్యలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## కార్మికుల సమస్యలపై పోరాటం



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సింగరేణిలో పనిచేసి రిటైర్మెంట్ అయిన కార్మికులకు అనేక సౌకర్యాలు కల్పించాలని, వారికి ఏఐటీయూసీ అండగా ఉంటుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కొమరయ్య భవన్ లో సింగరేణి రిటైర్మెంట్ కార్మికుల సి పి ఆర్ ఎం ఎస్ హెల్త్ కార్డులపై రిటైర్మెంట్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ మీటింగులో ట్రస్ట్ మీటింగ్ లో జరిగిన విషయాలపై రిటైర్మెంట్ కార్మికులకు రాజ్ కుమార్ వివరించారు. ఇందులో 40 శాతం రికవరీ ఆపుట కొరకై ఉచిత అంబులెన్స్ సౌకర్యం కోసం2017 నుండి 20 లక్షల గ్రాడ్యుటి పెంచుట, రిటైర్మెంట్ కార్మికులకు తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని మినిమం పెన్షన్ 10,000 రూపాయలు పెంచాలని తదితర డిమాండ్లపై రాజ్ కుమార్ కు సింగరేణి రిటైర్మెంట్ కార్మికులు వివరించడం జరిగింది. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రాజ్ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమం లో భూపాలపల్లి సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గుండేటి సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి సీట్ల రాజిరెడ్డి, ఉపాధ్యక్షులు మాడుగుల సమ్మిరెడ్డి, పంతంగి సమ్మయ్య, సముద్రారెడ్డి, కొమురయ్య, రామస్వామి, ఉడుత సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### హెచ్‌సిఎ బోర్డ్, సన్‌రైజర్స్ ఫ్రాంచైజ్ యాజమాన్యంపై

# చర్యలు తీసుకోవాలి

### తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఐపిఎల్ టికెట్‌ల జారీలో పారదర్శకత లేకుండా వ్యవహరించిన హెచ్‌సిఎ బోర్డ్, సన్ రైజర్స్ ఫ్రాంచైజ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, హెచ్‌సిఎ బోర్డ్ కమిటీని రద్దు చేయాలని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఎఐవైఎఫ్), డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డిఐఎఫ్ఐ), ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పివైఎల్) తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉప్పల్ క్రికెట్ స్టేడియంలోని హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్ మోహన్ రావుకు యువజన సంఘాల ప్రతినిది బృందం శనివారం వినతిపత్రం అందచేసేందుకు ప్రయత్నించగా బోర్డ్ సిబ్బంది, సెక్యూరిటీ వారిని అడ్డుకున్నారు. ఈక్రమంలో అక్కడ తోపులాట చోటు చేసుకుంది. అనంతరం బోర్డ్ ఇన్ వార్డ్ సెక్షన్ ఆఫీసర్ నారాయణకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలి ఉల్లా ఖాద్రీ, కె. ధర్మేంద్ర, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోటా రమేష్, పివైఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ మాట్లాడుతూ ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 25న జరగాల్సిన సన్ రైజర్స్ హైదరాబాద్ రాయల్ ఛాలెంజర్స్ జట్ల మధ్య ఐపిఎల్ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్‌లను గత శుక్రవారం విక్రయానికి పెట్టారని, పేటిఎంలో అమ్మకానికి పెట్టిన క్షణాల్లోనే టికెట్‌లు అమ్ముడు పోయాయంటూ బోర్డ్ యాజమాన్యం ప్రకటించిందని తెలిపారు. దాదాపు 36 వేలకుపైగా టికెట్‌లను అమ్మకానికి పెట్టిన అరగంట, గంటలోపే ఏలా అమ్ముడుపోతాయో హెచ్‌సిఎ, సన్ రైజర్స్ యాజమాన్యాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. హెచ్‌సిఎ, సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్వాహకులు మాత్రం టికెట్‌లను బ్లాక్ మార్కెట్ ద్వారా అక్రమంగా విక్రయించారని విమర్శించారు. టికెట్‌ల జారీ చేసే సంస్థ పేటీఎం క్రికెట్ ప్రేమికులను పణంగా పెట్టి అంతర్గత విభేదాలను సద్వినియోగం చేసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో హెచ్‌సిఎ, ఐపిఎల్ నిర్వాహకులు టిక్కెట్‌ల విక్రయాల వివరాలను బహిర్గతం చేసేవారన్నారు. ప్రభుత్వం టిక్కెట్‌ల విక్రయాన్ని ఆధార్ కార్డులకు అనుసంధానం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జావీద్, పివైఎల్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రవి కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర నేతలు గిరి బాబు, రవి, అజీమ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

**నేడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు**

నేడు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఎఐవైఎఫ్, డివైఎఫ్ఐ, పివైఎల్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఐపిఎల్ టికెట్‌ల కుంభకోణాలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపించాలన్నారు. హెచ్‌సిఎ బోర్డ్ కమిటీని రద్దు చేయాలని, సన్ రైజర్స్ ఫ్రాంచేజీ యాజమాన్యం,హెచ్‌సిఎ బోర్డ్‌లు ఐపిఎల్ టికెట్‌లను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్న విక్రయాలను అడ్డుకుని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఉప్పల్ స్టేడియం వద్ద నిరసన చేసిన యువజన సంఘాల నేతల అక్రమ అరెస్టులకు నిరసనగా, అన్ని జిల్లాలలో నిరసనలు కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

### అగ్రిగోల్డ్ ఆస్తులను వేలం వేసి

# బాధితులను ఆదుకోండి

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఎన్.బాలమల్లేష్ వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వం వెంటనే వేలం వేసి, బాధితులకు ఆదుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను తెలంగాణ రాష్ట్ర అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్. బాలమల్లేష్ కోరారు. ఈ మేరకు శనివారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు బాధితులను ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. ఉపముఖ్యమంత్రిని కలిసిన వారిలో బాలమల్లేష్‌తో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి. రజిత, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్. సునీత, రాష్ట్ర నాయకులు లక్ష్మి ఉన్నారు. ఈ సందర్భంగా బాలమల్లేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్ చేసిన వారు, చేయించిన ఏజెంట్లు మొత్తం దాదాపు 5 లక్షలు మంది ఉంటారని తెలిపారు. వారి మొత్తం డిపాజిట్లు రూ.500 కోట్ల వరకు ఉంటాయని, కాగా అగ్రిగోల్డ్ ఆస్తులు తెలంగాణ రాష్ట్రంలో రూ.వెయ్యి కోట్లకుపైగా ఉంటాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని, రాష్ట్రంలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తులను జప్తు చేసి, బాధితులకు డబ్బులు చెల్లించాలని ప్రభుత్వాన్ని బాలమల్లేష్ డిమాండ్ చేశారు. ఈ విధంగా చేస్తే రాష్ట్రంలో ఉన్న ఐదు లక్షల డిపాజిట్ దారులు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తారని బాలమల్లేష్ ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలించి, తగిన చర్యలు తీసుకొని, బాధితులను ఆదుకోవాలని కోరారు. అగ్రిగోల్డ్ ఆస్తులను వేలం వేస్తే ప్రభుత్వంపై ఆర్థిక భారం పడదన్నారు. బాధితులకు న్యాయం చేసిన వారవుతారని బాలమల్లేష్ అన్నారు.

## అర్హులైన కార్మికులందరికీ సంక్షేమఫలాలు

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు డిమాండ్



**ప్రజాపక్షం/నడిగూడెం :** భవననిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా వచ్చే ఫలాలు అర్హులైన కార్మికులందరికి తక్షణమే అందించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కార్మికుల హక్కులపై పోరాటాలకు కార్మికులు సన్నద్ధం కావాలన్నారు. ప్రమాదవశాత్తు కార్మికులు చనిపోతే వారి కుటుంబానికి ప్రస్తుతం ఇస్తున్న రూ.6లక్షలు కాకుండా రూ.10 లక్షలకు పెంచాలన్నారు. సహజ మరణానికి రూ.3 లక్షలు పెంచాలని,ఇంట్లో కుమార్తె పెళ్లి అయితే రూ.50వేలు ఇవ్వాలని, నిర్మాణ కార్మికులందరికి పిఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించి పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో షెడ్లను ఏర్పాటు చేసి సురక్షితమైన మంచినీటిని ఏర్పాటు చేయాలన్నారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ ఫలాలు అందకుండా మధ్య దళారీలు ప్రయత్ని స్తున్నారని వారికి అడ్డుకట్ట వేయాల్సినటువంటి అధికారులు చోద్యం చూస్తున్నారని అన్నారు.ఈ సమావేశంలో మండల నూతన భవన నిర్మాణ సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా నిర్వహించారు. మండల అధ్యక్షులుగా ఎం.డి అఫ్జల్, ఉపాధ్యక్షులుగా పల్లపు శ్రీను, దేరంగుల వీరన్న, గుంజ వెంకన్న,ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి మల్లిఖార్జున్, సహాయ కార్యదర్శిగా దేవరంగుల దుర్గారావు, పల్లపు శేఖర్, కార్యదర్శిగా పల్లపు గోపాల్ ఎన్నికయ్యారు.

## కార్మిక చట్టాల పునరుద్ధరణకు బిజెపిని ఓడిద్దాం

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు




**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** మోదీ నుండి దేశాన్ని కాపాడాలని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వాన్ని ఓడించి దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో 138వ మేడే పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం మోసపూరిత కుట్రలు కుతంత్రాల ప్రభుత్వం నడుస్తుందని, ఒకప్పుడు నష్టం వచ్చే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసేవారిని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కల్లబొల్లి కబుర్లతో లాభాలు వచ్చే సంస్థలను కూడా అమ్మకానికి పెట్టిందని, ఏకంగా ప్రభుత్వం వ్యాపారం చేయదు అని చెబుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలు, గనులను, రవాణా, టెలికాం, బ్యాంకు, బీమా, కంపెనీలను చివరికి దేశ రక్షణ కోసం పనిచేసే డిఫెన్స్ రక్షణ రంగాన్ని కూడా వదలకుండా ప్రైవేట్ పరం చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. ల్యాబ్, ఇస్రో లాంటి ప్రతిష్టాత్మకమైన పరిశోధనల సంస్థలను కూడా అంబానీ, ఆదానీ లాంటి పెట్టుబడిదారులకు అమ్మేందుకు సిద్ధపడుతున్నారని, వీటితో సంతృప్తి చెందని ఆర్థిక బకాసురులైన పెట్టుబడిదారులకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మానిటైజేషన్ పైపు లైన్ పేరుతో ప్రభుత్వ ఆస్తులను 30 నుండి 90 సంవత్సరాల వరకు లీజు పేరుతో దారదత్తం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి దుర్మార్గపు పాలనను దేశం నుండి తరిమి వేయాలని, రేపు జరగబోయేటువంటి పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మేడే సందర్భంగా అన్ని వర్గాల ప్రజల్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఖలీందర్ అలీ ఖాన్, ఉపాధ్యక్షులు మిట్టపల్లి ఫౌల్, రాజమల్లు, మెడికల్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు రాయమల్లు, మధు, రాకేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జూన్ మూడవ వారంలో ఖమ్మంలో టియుడబ్ల్యుజె రాష్ట్ర మహాసభలు

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ఖమ్మం నగరంలో జూన్ మూడో వారంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) రాష్ట్ర మూడవ మహాసభలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కె.విరాహత్ అలీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ బషీర్ బాగ్ లోని యూనియన్ రాష్ట్ర కార్యాలయం దేశోద్ధారక భవన్‌లో ఐజెయు అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ఖమ్మం జిల్లా ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ జూన్ 13వ తేదీన పూర్తవుతున్నందున, జూన్ 18, 19 తేదీలలో మహాసభలు నిర్వహించాలని యోచిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి సుమారు 300 మంది ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నదన్నారు. మహాసభ నిర్వహణకు సంబంధించి త్వరలో ఆహ్వాన సంఘం ఏర్పాటు కానుందని వారు పేర్కొన్నారు. ఈ మహాసభల సందర్భాన్ని పురస్కరించుకొని మే మాసంలో ఖమ్మం జిల్లాలో సెమినార్లు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు శేఖర్, విరాహత్ అలీ వెల్లడించారు.

# లొసుగులు కనిపెట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

గ్రహించి సమర్థవంతంగా ఆ లొసుగులను పరిష్కరించవలసి ఉంటుందని తాను అంచనా వేస్తున్నానన్నారు. ఈ విధంగా లొసుగులు బయటపడితే వాటిపై చర్చించడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ విధమైన చర్చలే నేర న్యాయ వ్యవస్థను సమర్థవంతంగా విస్తరించడానికి, అమలు చేయడానికి దోహదం చేస్తాయన్నారు. నేర న్యాయాన్ని కొత్త యుగంలోకి నడిపించడం ద్వారా భారతదేశ న్యాయ చట్రంలో ఈ మూడు కొత్త చట్టాలు గొప్ప పరివర్తన తెస్తాయన్నారు. బాధితుల ప్రయోజనాలు రక్షించడానికి కూడా ఈ కొత్త చట్టాలలో అవసరమైన అనేక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. తద్వారా దర్యాప్తును ముందుకు నడిపించడానికి, వాది—ప్రతివాదులలో తప్పు చేసినవారెవరో సమర్థవంతంగా తేల్చి శిక్ష విధించడానికి వీలు కలుగుతుందని అన్నారు. ''భారతదేశం తన నేర నియంత్రణ చట్టాలను సమూలంగా ప్రక్షాళన చేయడం ద్వారా అమలుకు సిద్ధమయ్యాయి. ఈ చట్టాలు భారతదేశ సమాజ చరిత్రలో ఒక మైలురాయి ఘట్టం, ఎందుకంటే సమాజ గమనంలో రోజువారీ ప్రవర్తనకు సంబంధించి క్రిమినల్ చట్టాలు తప్ప మరి ఏ ఇతర చట్టాలు కూడా ప్రజలపై నిరంతర ప్రభావం చూపించవు'' అని చంద్రచూడ్ అన్నారు. ''ఈ కొత్త చట్టాలను పార్లమెంటు ఆమోదించడం అంటే భారతదేశం మారుతోందనడానికి ఒక స్పష్టమైన చిహ్నం, ప్రస్తుత సవాళ్ళను సమర్థంగా ఎదుర్కోవడానికి ఒక ఆయుధాన్ని సమకూర్చుకుంది'' అని అన్నారు. కేంద్ర న్యాయశాఖామంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ , అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తదితరులు కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య చట్టాలు మూడింటినీ గత ఏడాది డిసెంబరు 21వ తేదీన పార్లమెంటు ఆమోదించింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ బిల్లులకు డిసెంబరు 25న ఆమోద ముద్ర వేయడంతో ఇవన్నీ చట్ట రూపం దాల్చాయి.

**సాంకేతికతతో నేర నియంత్రణకు కొత్త సవాళ్ళు**

ఈ సందర్భంగా భారతీయ సాక్ష్య సంహితపై రాజ్యసభ స్థాయీ సంఘం ఇచ్చిన తన 248వ నివేదికను జస్టిస్ చంద్రచూడ్ ఈ సదస్సులో ప్రముఖంగా ప్రస్తావించారు. ఎంతో లోతైన సాంకేతిక మార్పులు దేశంలో సంభవిస్తున్నాయనీ, మన ఆర్థిక, సాంఘిక జీవనంలో ఈ సాంకేతికత పెద్ద ప్రభావం చూపిస్తున్నదనీ, అందుకు తగ్గట్టే నేరాలు కూడా పెరుగుతున్నాయనీ, ఈ దశలో భారత నేర నియంత్రణ వ్యవస్థ పోరాటం చేస్తోందని అన్నారు. సాంకేతికత పెరిగే కొద్దీ కొత్త నేరాలు పుట్టుకొస్తాయన్నారు. నేరాల దర్యాప్తులో ఇవన్నీ సవాళ్ళుగామారతాయన్నారు. ఈ కొత్త చట్టాలు దేశంలో పరివర్తన తీసుకు వస్తాయ ని, న్యాయ చట్రాన్ని కొత్త యుగంలోకి నడిపిస్తాయన్నారు. నేర పరిశోధనలో ఆడియో విజువల్ దర్యాప్తు వాటిని స్వాధీనంచేసుకోవడం కీలకంగా మారిందన్నారు. పౌరహక్కులను, ప్రజలను కాపాడటంలో ఈ విధమైన సాక్ష్యాలు ప్రాసిక్యూషన్‌కు కీలక సాధనాలుగా మారుతున్నాయన్నారు.

## ఓటేయడం మరచిపోవద్దు

### ఓటర్లకు చంద్రచూడ్ పిలుపు

దేశంలో ప్రజలు ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటుహక్కు ఉపయోగించుకోవడం మరచిపోవద్దని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ పిలుపు ఇచ్చారు. 2024 లోక్‌సభ ఎన్నికల నిమిత్తం భారత ఎన్నికల సంఘం వారు ''మై ఓట్—మై వాయిస్'' పేరుతో రూపొందించిన వీడియో సందేశంలో జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడారు. ''మనం ఈ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యలో పౌరులం, మనం ఓటు వేయడం మరచిపోవద్దు'' అని సందేశం ఇచ్చారు. ''ఒక పౌరుడుగా ఈ దేశ రాజ్యాంగం మనకు బహుముఖ హక్కులు కల్పించింది, దేశంలో ప్రతి పౌరు డూ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారనే రాజ్యాంగం భావిస్తూ ఉంటుంది, అందువల్ల మన విధులు మనం నిర్వర్తించాలి, ఈ విధుల్లో అతి ముఖ్యమైనది మన ఓటు హక్కును వినియోగించుకోవడం'' అని చంద్రచూడ్ తన సందేశంలో చెప్పారు. ''నేను ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా, పౌరులుగా ఎవ్వ రూ ఈ అవకాశాన్ని వదులుకోవద్దు, ఓటు వేయడం పౌరుల బాధ్యత, మన మాతృభూమిలో ఇది మనకు ప్రథమ కర్తవ్యం, ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి మన మాతృభూమి కోసం ఐదు నిమిషాల్లో మనం చేయగలిగిన విధి ఇది కాదంటారా? అందువల్ల గర్వంగా మనం మన ఓటు వేద్దాం, 'మై ఓట్—మై వాయిస్' అని చంద్రచూడ్ ఆ సందేశంలో పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో ప్రజలు తమ వంతు పాత్ర నిర్వహించాలి, భాగస్వామ్యం కావాలి, ప్రభుత్వం అనేది ప్రజలకు సంబంధించింది ప్రజలచేత, ప్రజల వలన, ప్రజల కొరకు ఈ ప్రభుత్వం'' అని పేర్కొన్నారు. మొదటిసారి ఓటు వేసేందుకు సిద్ధమై పోలింగ్ బూత్‌లవద్ద బారులు తీరిన ఓటర్లకు ఉన్న ఉత్కంఠను కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.''మన ఓటు వేయడానికి మనల్ని అనుమతించే ముందుగా మన వేలిపై వేసే సిరాచుక్క ముద్ర మనకు ఎంతో ఉత్కంఠ కలిగిస్తుంది, దేశభక్తి భావనను పెంపొందిస్తుంది, జాతితో మనల్ని మమేకం చేస్తుంది'' అని సందేశం ఇచ్చారు. అందువల్ల మన రాజ్యాం గం, మన చట్టాలు ఒక పౌరుడికి ఒక ఓటు వేసే హక్కు ఇచ్చాయి, దానికి ఎంతో విలువ కల్పించాయి, జాతి శక్తికి, ప్రజాస్వామ్య రాజ్యాంగానికీ గొప్ప ధృఢత్వం ఇదే'' అన్నారు. అందువల్ల ఓటు వేయడాన్ని ఎప్పటికీ మానకండి అన్నారు. ఈనెల 19వ తేదీన దేశంలో ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ ఆరు వారాల పాటు కొనసాగుతుంది. జూన్ 1వ తేదీతో ఈ ప్రక్రియ ముగుస్తుంది. 18వ లోక్‌సభ ఎన్నికల్లో 543 మంది సభ్యులను దేశ ప్రజలు ఎన్నుకోవలసి ఉంటుంది. జూన్ నాలుగో తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

## తాగునీటి సరఫరాకు చర్యలు

**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** వేసవికాలం పూర్తి అయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా ప్రజలందరికీ సరిపడా త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లాలోని హాజీపూర్ మండలంలో గల ఎల్లంపల్లి ప్రాజెక్టును జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్, మంచిర్యాల మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్, మిషన్ భగీరథ ఈ.ఈ. మధుసూదన్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు సెగ్మెంట్ పరిధిలో వేసవికాలం పూర్తయ్యే వరకు నిరంతర త్రాగునీటి సరఫరాకు కార్యచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి అందుతున్న త్రాగునీటి సరఫరా ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని, సమస్యలు తలెత్తినట్లయితే త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకం క్రింద జిల్లాలో జరుగుతున్న నీటి సరఫరాపై ప్రతి రోజు నివేదిక అందించాలని తెలిపారు. పైప్లైన్ల లీకేజీ సమస్యలు, బోర్వెల్ల మరమ్మత్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి నీటి సరఫరాను పునరుద్ధరించేలా త్వరితగతిన పనులు చేపట్టాలని తెలిపారు.

## ఇద్దరు ఖైదీలు మృతి (మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు ఖైదీలు గాయపడ్డారు. మృతులను హర్ష్, ధర్మేందర్‌గా, గాయపడిన వారిని గగన్‌దీప్ సింగ్, మహ్మద్ సెహ్వాజ్‌గా గుర్తించారు. మరోవైపు గాయపడిన ఖైదీలను సంగ్రూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే మెరుగైన చికిత్స కోసం వారిని పాటియాల ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. నలుగురు ఖైదీలపై తొమ్మిది మంది ఖైదీలు ఎందుకు దాడి చేశారో అన్నదానిపై జైలు అధికారులు, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పడవ బోల్తా (మొదటి పేజీ తరువాయి)

పడింది. వెంటనే గమనించిన స్థానిక మత్స్యకారులు నదిలోకి దూకి 35 మందిని కాపాడారు. తర్వాత పోలీసులు, సహాయక సిబ్బంది కొంతమందిని రక్షించారు. గల్లంతైన వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం గల్లంతైన ఏడుగురి మృతదేహాలను వెలికి తీశారు. అయితే ప్రయాణికులంతా ఛత్తీస్‌గఢ్ ఖర్సేనికి చెందిన వారు. పడవ సామర్థ్యానికి కంటే ఎక్కువ మందిని తీసుకెళ్లడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులను కాపాడిన మత్స్యకారులు తెలిపారు. ఈ ఘటనలో మరణించినవారికి ఒడిశా సిఎం నవీన్ పట్నాయక్ రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. సురక్షితంగా బయటపడిన వారందరికీ సరైన వైద్యం అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మరోవైపు ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ సిఎం విష్ణుదేవ్ సాయ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఝార్సుగూడ జిల్లా పరిపాలన యంత్రాంగంతో ఈ ప్రమాదం గురించి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నామని తెలిపారు. ఝార్సుగూడ జిల్లా కలెక్టర్ కార్తికేయ గోయల్ ఘటనాస్థలిలో ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. 'ఒడిశా డిజాస్టర్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. గల్లంతైన వారిని రక్షించేందుకు భువనేశ్వర్ నుంచి స్కూబా డైవర్లు వస్తున్నారు. మరణించిన వారిలో 35 ఏళ్ల మహిళ ఉంది. గల్లంతైన వారిలో నలుగురు మహిళలు, ముగ్గురు పిల్లలు ఉన్నారు' కలెక్టర్ తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com